మరో 15 ఏళ్లపాటు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉంటే.. నవ్యాంధ్రలో స్వర్ణయుగం సాకారం అవుతుంది.సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చింది. రాష్ట్రంలో పలుమార్లు అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి 2లక్షల పోస్టులు భర్తీ చేసిన ఘనత టీడీపీదే.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

శుక్రవారం 25.09.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 155 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# స్థిర ప్రభుత్వంతోనే పేదరిక నిర్మూలన



- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్.. ఏపీ ప్రత్యేకత
- ప్రాజెక్టుల గ్రౌండింగ్‌కే ప్రథమ ప్రాధాన్యత
- 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీ
- క్వాంటంతో పాటు హార్టికల్చర్, ఆక్వాకల్చర్‌కూ పెద్దపీట
- అక్టోబర్ 2న హార్టికల్చర్ మిషన్ ప్రారంభం
- ఏపీలో 23 ప్రత్యేక క్లస్టర్ల అభివృద్ధి
- ఉద్యోగాల కల్పనే.. మా ఏకైక అజెండా: లోకేష్

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** స్థిరమైన ప్రభుత్వంతోనే పేదరిక నిర్మూలన జరుగుతుంది. అగ్రికల్చర్ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్ వరకు స్పీడ్ ఏపీ కల్చర్ గా మారింది. స్పీడ్ ఈజ్ మనీ.. టైం ఈజ్ మనీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర@2047' అంశంపై నిర్వహించిన 'ఫైర్‌సైడ్ చాట్' కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వివో మొబైల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రెసిడెంట్ అర్జిత్ సేన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రతి రాజకీయ పార్టీకి ఓ కల్చర్ ఉంటుంది. ప్రభుత్వాలకు కూడా ఉంటుంది. ఆ కల్చర్ నాయకత్వం నుంచి వస్తుంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏపీ కల్చర్. ఆ వేగాన్ని మేం ఇప్పుడు క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లాం. ప్రతిఒక్కరూ వేగాన్ని ఎలా అందుకోవాలని ఆలోచిస్తున్నారు. మంత్రివర్గ సమావేశంలో కూడా ఫైళ్లను ఎంత వేగంగా పరిష్కరిస్తున్నారనే అంశంపై చర్చ జరుగుతుంది. దీనిపై మంత్రులకు ర్యాంకులు కూడా ఇవ్వడం జరుగుతుంది. అదే విధానం బ్యూరోక్రసీ స్థాయిలో కూడా ఉంటుంది.

**స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏపీ ప్రత్యేకత :** పెట్టుబడులను ఆకర్షణలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏపీ ప్రత్యేకత. పొరుగు రాష్ట్రాల్లో దశాబ్దానికి పైగా నిలిచిపోయిన ప్రాజెక్టులను ఏపీలో 18 నెలల్లోపే ప్రారంభించగలిగాం. 13 నెలల్లోనే విశాఖకు గూగుల్ డేటా సెంటర్ ను తీసుకువచ్చాం. విధానాల విషయంలో కూడా ఇదే వేగం అవసరం. టెక్నాలజీ చాలా వేగంగా మారుతోంది. వేగవంతమైన పురోగతి జరుగుతోంది. సాధారణంగా విధానాలు టెక్నాలజీ కంటే ఒక అడుగు వెనుకే ఉంటాయి. విధానాలు కూడా తమను తాము మార్చుకునేందుకు మంత్రుల పాత్ర, బ్యూరోక్రాట్ల పాత్ర కీలకమవుతుంది. పౌరులకు వేగంగా సేవలందించేందుకు 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ను తీసుకువచ్చాం. దాదాపు వెయ్యి పౌర సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తున్నాం. టెక్నాలజీని విస్తృతంగా ఎలా ఉపయోగిస్తున్నామో చెప్పడానికి ఇదో ఒక గొప్ప ఉదాహరణ. అందువల్ల స్పీడ్ ఇప్పుడు ఏపీ ప్రభుత్వ సంస్కృతిగా మారింది. ఇది వ్యవసాయం నుంచి తయారీ రంగం వరకు, పాలన నుంచి ఐటీ వరకు అన్ని రంగాల్లో మార్పును తీసుకొస్తోంది. సీఎం చంద్రబాబు నేతృత్వంలో మేం తీసుకొచ్చిన ప్రధాన సాంస్కృతిక మార్పు ఇదే.

**రాష్ట్రవ్యాప్తంగా 23 ప్రత్యేక క్లస్టర్ల అభివృద్ధి :** రాష్ట్రంలో 23 ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం. అవి స్పేస్, డ్రోన్లు, సిమెంట్, స్టీల్, మెడికల్ డివైసెస్, ఫార్మా, ఏఐ, డేటా నుంచి హార్టికల్చర్, ఆక్వా రంగాల వరకు విస్తరించాయి. వర్టికల్, హారిజాంటల్ విధానంలో ముందుకు వెళ్తున్నాం. ఒక పూర్తిస్థాయి నౌకను తయారు చేయడానికి సుమారు 360 కంపెనీల అవసరం ఉంటుంది. ఫైర్‌ఫైటింగ్ పరికరాలు, నావిగేషన్ పరికరాలు, లైటింగ్,

● మిగతా 2 లో



## ఏపీ స్టార్టప్‌లకు మాస్టర్‌కార్డ్

- విశాఖలో టెక్ సెంటర్ ఏర్పాటుకు లోకేష్ ఆహ్వానం
- ఆర్టీఐహెచ్‌లో భాగస్వామ్యం వహించాలని విజ్ఞప్తి
- ఫిన్‌టెక్ రంగంలో యువతకు నైపుణ్య శిక్షణ
- పర్యాటకాభివృద్ధికి మరింత సహకారం కోరిన మంత్రి

2 లో




## ఏపీ-గుజరాత్ వాణిజ్య బంధం

- టీటీడీ ఆలయ నిర్మాణానికి భూమి కేటాయించాలని లోకేష్ విజ్ఞప్తి
- విజయవాడ ఉత్సవ్‌కు గుజరాత్ సీఎంకు ఆహ్వానం
- 2027 గోదావరి పుష్కరాలకు రావాలని పిలుపు
- భూపేంద్ర పటేల్‌తో ఏపీ మంత్రి లోకేష్ భేటీ



**గాంధీనగర్ (గుజరాత్) (జర్నలిస్ట్ ఫైల్) :** గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తో ఏపీ విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ గాంధీనగర్ లో భేటీ అయ్యారు. తీరప్రాంత రాష్ట్రాల వృద్ధి, పారిశ్రామిక నియంత్రణ సడలింపు, ఆర్థిక సంస్కరణలు వంటి కీలక జాతీయ విధాన చర్చల్లో ఆంధ్రప్రదేశ్, గుజరాత్ ఏకతాటిపై ఉండాలని కోరారు. మిగతా 2లో...

## ఏపీకి సిస్కో సెంటర్



- విశాఖలో ఇంజినీరింగ్ సెంటర్/జీసీసీకి లోకేష్ ప్రతిపాదన
- సర్వర్లు, స్విచ్‌లు, రౌటర్ల తయారీకి ఆహ్వానం

2 లో

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** గ్లోబల్ నెట్‌వర్కింగ్, సెక్యూరిటీ, కొలాబరేషన్ & ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లో పేరెన్నికగన్న సిస్కో సిస్టమ్స్ (యుఎస్ఏ) మేనేజింగ్ డైరెక్టర్

## ఏపీలో కాంపొనెంట్స్ తయారీ పార్కు



**వివో సరఫరాదారుల కోసం పార్కు అభివృద్ధి చేయండి**

**వివో ఇండియా అధ్యక్షుడు అర్జిత్ సేన్‌తో లోకేష్ భేటీ**

**తిరుపతిలో తయారీ కేంద్రం ఏర్పాటుపై పరిశీలన**

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్ ఫోన్, యాక్సెసరీస్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ వివో ఇండియా ప్రెసిడెంట్ అర్జిత్ సేన్ (గవర్నమెంట్ ఎఫైర్స్ & స్ట్రాటజిక్ ఎంగేజ్ మెంట్)తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. మిగతా 2లో...

## పెట్టుబడులకు పంచముఖి వ్యూహం



- ఐదు ప్రాంతాల్లో రీజినల్ కాన్ఫరెన్సులు
- ఎంఎస్ఎంఈలకు పెద్దపీట.. 30 నియోజకవర్గాల్లో పార్కులు
- అక్టోబర్‌లోనే 80% పెట్టుబడుల కన్వర్షన్
- కన్వర్ట్ అయిన వాటిలో 75% గ్రౌండింగ్ లక్ష్యం
- పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** పార్టనర్షిప్ సమ్మిట్-2026కు సన్నాహకంగా రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో 5 రీజినల్ కాన్ఫరెన్సులు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, అనంతపురం, తిరుపతిలో రీజినల్ కాన్ఫరెన్సులు నిర్వహించి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించాలని, ప్రాజెక్టులకు ఎంవోయూలు జరగాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఆయా ప్రాంతాల ప్రత్యేకతలు, పెట్టుబడి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని చర్చలు నిర్వహించాలన్నారు. మిగతా 3లో...

## ఏపీలో అబాట్ అడుగులు



- మెడికల్ డివైసెస్, డయాగ్నస్టిక్స్ యూనిట్‌కు ఆహ్వానం
- విశాఖలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదన
- నక్కపల్లి డ్రగ్ పార్క్‌లో జనరిక్ తయారీకి పిలుపు
- ఏపీ ప్రతిపాదనలపై పరిశీలన: అబాట్ ఎండీ

2 లో

## కాకినాడలో గ్రీన్ అమ్మోనియా

- యారా తయారీ, ఎగుమతి కేంద్రానికి లోకేష్ ప్రతిపాదన
- ఎరువుల మిశ్రమం, సూక్ష్మపోషకాల ఉత్పత్తికి ఆహ్వానం
- వ్యవసాయ వర్సిటీ సహకారంతో డిజిటల్ అగ్రి సెంటర్
- పెట్టుబడుల ప్రతిపాదనలపై యారా పరిశీలన



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రముఖ క్రాప్ న్యూట్రిషన్, ఫెర్టిలైజర్స్, అమ్మోనియా తయారీ సంస్థ యారా ఇంటర్నేషనల్ ఎఎస్ఎ పబ్లిక్ ఎఫైర్స్ & కమ్యూనికేషన్స్ హెడ్ వైశాలి చోప్రాతో మిగతా 2లో...

## ఏపీలో గోద్రెజ్ మరిన్ని పెట్టుబడులు

- ఆగ్రో కెమికల్ యూనిట్‌కు లోకేష్ ఆహ్వానం
- ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్.. సమాధాన్ కేంద్రాల విస్తరణ
- రెడీ టు ఈట్ పాల ఉత్పత్తులకు ప్లాంట్లు ఏర్పాటు చేయండి
- ద్వారకా తిరుమలలో రూ.210 కోట్ల పెట్టుబడి



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామితో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. మిగతా 2లో...

## స్మార్ట్ గవర్నెన్స్‌కు శాప్ టెక్నాలజీ

- ఏపీలో డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఏర్పాటుకు ఆహ్వానం
- ఎస్ఎంఈల డిజిటలైజేషన్‌కు సాంకేతిక చేయూత
- ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తాం: లవ్‌నీష్ చనానా



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :**జర్మనీకి చెందిన ప్రముఖ ఎంటర్ ప్రైజ్ సాఫ్ట్ వేర్, క్లౌడ్, బిజినెస్ ఎఐ అభివృద్ధి సంస్థ శాప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లవ్‌నీష్ చనానాతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ మిగతా 2లో...

## ఏపీ స్టార్టప్‌లకు మాస్టర్‌కార్డ్



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రముఖ గ్లోబల్ పేమెంట్స్, టెక్నాలజీ సంస్థ మాస్టర్ కార్డ్ ఇంక్. (యుఎస్ఎ) వైస్ ప్రెసిడెంట్ ఱ గవర్నమెంట్ ఎఫైర్స్ హెడ్ అభిషేక్ లాహిరితో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... విశాఖపట్నంలో భూమి లభ్యత, ఐటీ ఱ జీసీసీ పాలసీ మద్దతుతో ఒక జీసీసీ / టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. స్టార్టప్‌లకు మార్గదర్శకత్వం వహించి, వాటిని ప్రోత్సహించడానికి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో ఫిన్‌టెక్ సలహాదారు సభ్యునిగా చేరాల్సిందిగా ఆహ్వానించారు. ఫైనాన్స్, బ్యాంకింగ్, ఫిన్‌టెక్ రంగాల్లో సీఎస్ఆర్ ద్వారా నైపుణ్యాభివృద్ధి, పీ4 కార్యక్రమాల్లో భాగస్వామ్యం వహించాల్సిందిగా విన్నవించారు. మాస్టర్‌కార్డ్ తన 'ప్రైస్‌లెస్ ఎక్స్‌పీరియన్స్'ను రాజమండ్రి, కోనసీమ ప్రాంతంలో అమలు చేసింది. పర్యాటకాన్ని ప్రోత్సహించే ఈ చొరవకు సహకరించిన తొలి రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఆంధ్రప్రదేశ్‌లో మరిన్ని పర్యాటక, పర్యావరణ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. మాస్టర్ కార్డు వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ లాహిరి మాట్లాడుతూ... భారత్ లో పూణే, గురుగ్రామ్, ముంబై, హైదరాబాద్, బెంగళూరు, వడోదరలో కార్యాలయాల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మాస్టర్ కార్డ్ 2వేలమంది ఉద్యోగులను కలిగి ఉందని తెలిపారు. 6వేలమంది టెక్నాలజిస్టులతో ప్రపంచంలో అతిపెద్ద టెక్ హబ్ ను పూణేలో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్త "ప్రైస్‌లెస్" ప్లాట్‌ఫామ్ ద్వారా దిండి, తిరుపతి, సూర్యలంక, అరకు/వైజాగ్‌లను ప్రోత్సహించడానికి ఏపీ టూరిజం అథారిటీతో ఎంఓయు చేసుకున్నట్లు చెప్పారు. ఎపి ప్రభుత్వ తాజా ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని అన్నారు.

## ఏపీ-గుజరాత్ వాణిజ్య బంధం




(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమ తీరంలోని గుజరాత్, తూర్పు తీరంలో గేట్‌వేగా ఉన్న ఆంధ్రప్రదేశ్ సమన్వయంతో ముందుకు సాగితే సముద్ర, పోర్టుల ఆధారిత పరిశ్రమ పెద్దఎత్తున అభివృద్ధి సాధిస్తుందన్నారు. గుజరాత్ మోడల్ సముద్ర రవాణా అభివృద్ధిలో భాగంగా రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట నాన్-మేజర్ పోర్టులను ఏపీ అభివృద్ధి చేస్తోందన్నారు. ప్రైవేట్ పోర్టు కన్సెషన్లు, పోర్టుల ఆధారిత పారిశ్రామికీకరణలో ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి ద్వైపాక్షిక లాజిస్టిక్స్, వాణిజ్య కారిడార్ ఆవశ్యకతను మంత్రి లోకేష్ వివరించారు.

గుజరాత్ లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గిఫ్ట్ సిటీ ఫ్రేమ్‌వర్క్ ను ఆదర్శంగా తీసుకొని నూతన రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లో వైజాగ్, అమరావతి ప్రాంతాల్లో పెద్దఎత్తున పారిశ్రామిక అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి లోకేష్ చెప్పారు. దేశంలో అంతర్జాతీయ ఆర్థిక సేవలు, ఆవిష్కరణలకు గిఫ్ట్ IFSC ల్యాండ్ మార్క్‌గా నిలిచిందని కొనియాడారు. అదే తరహాలో విశాఖపట్నం, అమరావతిలో ఆధునిక బిజినెస్ డిస్ట్రిక్ట్ లను అభివృద్ధి చేయడానికి ఏపీ అమలుచేస్తున్న వ్యూహాలను వివరించారు. గిఫ్ట్ సిటీలోని సింగిల్-విండో క్లియరెన్స్, డెవలపర్ ప్రోత్సాహకాలు, నియంత్రణ నిర్మాణాలపై ద్వైపాక్షిక పరిజ్ఞాన మార్పిడికి మద్దతు అందించాలని కోరారు. ఏపీలో సెమీకండక్టర్ & గ్రీన్ ఎనర్జీ ఎకోసిస్టమ్ ను అభివృద్ధి చేస్తూ పారిశ్రామిక సప్లయ్ చైన్ తో అనుసంధానిస్తున్నామని తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్ (కాకినాడ హబ్), పారిశ్రామిక స్మార్ట్ సిటీలు (కొప్పర్తి, ఓర్వకల్లు), టెక్నాలజీ వర్క్‌ఫోర్స్ తయారీతో ఏపీ ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతోందని చెప్పారు.

అక్టోబర్ 11 నుండి 20 వరకు పున్నమి ఘాట్ వేదికగా జరగనున్న విజయవాడ ఉత్సవ్ కు హాజరు కావాల్సిందిగా గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌ను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆహ్వానించారు. గోదావరి పుష్కరాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ 2027 గోదావరి పుష్కరాలకు రావాల్సిందిగా గుజరాత్ సీఎంను కోరారు. గుజరాత్‌లో టిటిడి ఆధ్వర్యాన శ్రీవారి ఆలయ నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నామని, ఇందుకు అవసరమైన భూమి కేటాయించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ వెంట రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ ఉన్నారు.

## ఏపీకి సిస్కో సెంటర్



(మొదటి పేజీ తరువాయి)

(ఇండియా ఱ సౌత్ ఈస్ట్ ఆసియా) హరీష్ కృష్ణన్ తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... డేటా సెంటర్ ఎకోసిస్టమ్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్ లో భారీ ఉత్పత్తి వల్ల కలిగే ప్రయోజనాలను (ఎకానమీస్ ఆఫ్ స్కేల్) సాధించడానికి, డేటా సెంటర్ వాల్యూ చైన్ మొత్తం వ్యవస్థను రాష్ట్రంలోకి ఆకర్షించాలని ప్రభుత్వం యోచిస్తోందని చెప్పారు. డేటాసెంటర్ల డిమాండ్ కు అనుగుణంగా ఎపిలో యూనిఫైడ్ కంప్యూటింగ్ సిస్టమ్ సర్వర్లు, స్విచ్‌లు, రౌటర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ సెంటర్/జీసీసీని ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. సిస్కో ఇండియా ఎండి హరీష్ కృష్ణన్ మాట్లాడుతూ... భారతదేశంలో 8,000 మందికి పైగా ఇంజనీర్లతో సహా 16,000 మందికి పైగా సిబ్బంది, 1,000కి పైగా పేటెంట్లు - కీలకమైన ఇంజనీరింగ్ విభాగాలను సిస్కో కలిగి ఉందని తెలిపారు. చెన్నయ్ లోని తయారీ ప్లాంట్ ద్వారా 1 బిలియన్ డాలర్లకు పైగా ఎగుమతులు, దేశీయ అమ్మకాలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో 50వేలమంది యువతను నెట్‌అకాడ్ యాక్సెస్, ఐటీ, ఇతర పరిశ్రమల్లో అత్యంత నైపుణ్యం గల శ్రామిక శక్తిగా అభివృద్ధి చేయడానికి ఎపి ప్రభుత్వంతో గత ఏడాది మార్చిలో ఒప్పందం చేసుకున్నాం, ఈ ప్రోగ్రామ్ ఇప్పటికే అమలులో ఉందని తెలిపారు. విశాఖపట్నంలో ఇన్నోవేషన్ సెంటర్, తిరుపతిలో సీఓఈ, విజయవాడ స్మార్ట్ సిటీ, ఏపీ ఫైబర్‌నెట్ (22,500 కి.మీ.) ప్రాజెక్టుల్లో తాము భాగస్వామ్యం వహించినట్లు చెప్పారు. ఎపి ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.

# స్థిర ప్రభుత్వంతోనే పేదరిక నిర్మూలన

(మొదటి పేజీ తరువాయి)



మెటీరియల్ సైన్సెస్ వంటి అనేక రంగాలకు చెందిన కంపెనీలు కలిసి ఒక షిప్‌బిల్డింగ్ క్లస్టర్‌ను తయారు చేస్తాయి. ఇలాంటి 23 క్లస్టర్లను మేం అభివృద్ధి చేస్తున్నాం. వీటిని వర్టికల్స్ అంటారు. ఇక హారిజాంటల్ విధానంలో మానవ వనరుల అభివృద్ధి విభాగం వస్తుంది.

ఆయా క్లస్టర్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచాల్సిన అవసరం ఉంది. సర్టిఫికేషన్, టెస్టింగ్, వాలిడేషన్ వ్యవస్థలను కూడా అభివృద్ధి చేయాలి. స్కైరూట్ ఇందుకు ఉదాహరణ. ఏడాది క్రితమే మేం స్కైరూట్‌పై నమ్మకం ఉంచాం. వారికి 300 ఎకరాల భూమిని ఎకరాకు రూ.5 లక్షల చొప్పున ఇచ్చాం. వారు తమ ఉత్పత్తులను తయారు చేసుకోవడానికి, మన లాంచ్‌ప్యాడ్‌కు సమీపంలో తమ కార్యకలాపాలను ఏర్పాటు చేసుకోవడానికి ఈ భూమిని ఉపయోగిస్తున్నారు. అదేవిధంగా స్పేస్ సిటీని నిర్మిస్తున్నాం. అదే విధంగా సాగర్ డిఫెన్స్ అనే మరో సంస్థతో కూడా ఇదే విధానాన్ని అనుసరించాం. వారు సముద్ర సంబంధిత డ్రోన్లను తయారు చేస్తున్నారు. వారు మా వద్దకు వచ్చినప్పుడు వారి విలువ సుమారు రూ.3వేల కోట్లు ఉండేది. ఇప్పుడు అది రూ.23 వేల కోట్లకు చేరింది. ఈ మార్పు కేవలం 18 నుంచి 24 నెలల్లోనే జరిగింది. క్లస్టర్ ఆధారిత విధానం గొప్ప ఫలితాలను ఇస్తోంది.

**స్పీడ్ ఈజ్ మనీ.. టైం ఈజ్ మనీ :** ఎవరూ ఇంకా పెద్దగా దృష్టి పెట్టని, ప్రారంభ దశలో ఉన్న కంపెనీలను గుర్తించి ముందుగానే వాటిపై పెట్టుబడి రూపంలో నమ్మకం ఉంచగలుగుతున్నాం. కొన్ని రాష్ట్రాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కంపెనీలను కూడా ముందుగానే సంప్రదిస్తున్నాం. రాష్ట్రంగా మేం వారికి మద్దతు ఇస్తున్నాం. అవసరమైన ప్రక్రియలు సక్రమంగా పూర్తైన తర్వాత ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. ఆ తర్వాత వారు తమ సత్తాను చూపిస్తున్నారు. అదే విధానాన్ని ఆర్సెలర్ మిట్టల్ విషయంలో కూడా అనుసరించాం. 3వేల ఎకరాల భూమిని ఇచ్చాం. వారు తమ పనులను ప్రారంభించారు. 17 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరుగుతోంది. అసాధ్యాన్ని మేం సుసాధ్యం చేశాం. ఆదిత్య మిట్టల్ తో జూమ్ కాల్ నుంచి ప్రాజెక్టు గ్రౌండింగ్ వరకు పట్టిన కాలం 17 నుంచి 18 నెలలు మాత్రమే. పర్యావరణ అనుమతులు సహా అన్ని ప్రక్రియలను పూర్తి చేశాం. ఫలితాలపై దృష్టిపెట్టి పనిచేస్తున్నాం. ఇదే మమల్ని ఇతరుల కంటే ప్రత్యేకంగా నిలబెడుతోంది. ఎందుకంటే స్పీడ్ ఈజ్ మనీ, టైం ఈజ్ మనీ

**ప్రాజెక్టులను గ్రౌండింగ్ చేయడమే ప్రథమ ప్రాధాన్యత :** ప్రాజెక్టుల గ్రౌండింగ్ ను నేను స్వయంగా పర్యవేక్షిస్తున్నా. సమస్యలు ఏవైనా ఉంటే కలిసి పరిష్కరిస్తాం. కాబట్టి స్పీడ్ ను ప్రభుత్వ కల్చర్ గా మార్చడం, దానికి క్లస్టర్ ఆధారిత విధానాన్ని జోడించడం.. ఈ రెండూ కలిసి మనం ఈరోజు సాధిస్తున్న విజయాలకు కారణం అవుతున్నాయి. ప్రాజెక్టులను గ్రౌండ్ చేయడం మా ఏకైక ప్రధాన ప్రాధాన్యత. మేం కేవలం ఎంవోయూలపై ఆధారపడబోం. నాకు ఎంవోయూలపై సంతకం చేయడం అంతగా ఇష్టం లేదు. పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో కొన్ని ఎంవోయూలు చేసుకున్నాం. కానీ మేం 80 శాతం గ్రౌండింగ్ లక్ష్యంగా పెట్టుకున్నాం. 80 శాతం కంటే తక్కువ గ్రౌండింగ్ రాష్ట్రానికి ఆమోదయోగ్యం కాదని చెప్పాను. ఎందుకంటే ప్రాజెక్టు ఎంత త్వరగా గ్రౌండ్ అవుతుందో, అంత త్వరగా పన్నులు చెల్లిస్తారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అంత వేగంగా అభివృద్ధి చెందుతుంది. దీంతో 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అనే లక్ష్యం మరింత చేరువ అవుతుంది.

**సమగ్ర అభివృద్ధి ఏపీ లక్ష్యం :** అందరికీ పీపీపీ మోడల్ తెలుసు. ఏపీలో పీ-4 మోడల్ అమలుచేస్తున్నాం. ప్రజలను నాలుగో భాగస్వామిగా చేర్చాం. అభివృద్ధి ప్రయాణంలో పేదలు, వెనుకబడిన వర్గాలను విస్మరించకూడదు. మేం మరింత సమగ్ర అభివృద్ధి కోరుకుంటున్నాం. కేవలం నగదు ఇవ్వడం పరిష్కారం కాదని మేం విశ్వసిస్తున్నాం. ఆలోచనలు, అనుభవం, అవకాశాల పరిచయం కూడా అంతే ముఖ్యమైనవి. ఇక్కడ పరిశ్రమలు కీలక పాత్ర పోషించాలి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజలకు కొత్త అవకాశాలను పరిచయం చేయాలి. ఏపీలోని నియోజకవర్గాల్లో దీనివల్ల అద్భుతమైన మార్పులను చూస్తున్నాం. ముఖ్యమంత్రి గారు ఇటీవల తన నియోజకవర్గానికి వెళ్లి తిరిగి వస్తూ ఒక విషయం మాతో పంచుకున్నారు. ఏడాది క్రితం వరకు ఇటుకల బట్టీలో పనిచేసిన ఒక మహిళ ఇప్పుడు అదే వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. ఆమె ప్రస్తుతం 20 మందికి ఉపాధి కల్పిస్తోంది. ఆమెకు పెట్టుబడిగా అవసరమైనది కేవలం రూ.60వేలు మాత్రమే. కానీ అంతకంటే ముఖ్యంగా ఆమెకు బుక్‌కీపింగ్ ఎలా చేయాలి? కొత్త మార్కెట్లను ఎలా అన్వేషించాలి? ఉత్పత్తిని ఎలా అమ్మాలి? మార్కెటింగ్ ఎలా చేయాలి? అనే విషయాల్లో మార్గదర్శకత్వం అవసరమైంది. అక్కడే నిజమైన విలువ ఉంటుంది. ఎందుకంటే ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేకమైన అనుభవాలు ఉన్నాయి. మనమందరం మన అనుభవాల ఫలితమే. బిజినెస్ స్కూల్‌లో నేర్చుకునే దానికంటే, జీవిత ప్రయాణంలో మనం చాలా ఎక్కువ నేర్చుకుంటాం. ఆ అనుభవాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి. కంపెనీలు పాఠశాలలను దత్తత తీసుకోవడం కూడా మనం చూస్తున్నాం. ఇదే మేం అమలుచేస్తున్న పీ-4 మోడల్.

**రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉంటేనే దేశం గెలుస్తుంది :** రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ కూడా ఉండాలి. రాష్ట్రాలు పోటీ పడితే, భారతదేశం గెలుస్తుంది. నేను దీనిని పూర్తిగా విశ్వసిస్తా. ఈ కార్యక్రమం తర్వాత నేను గుజరాత్‌కు వెళ్తున్నాను. అక్కడ కూడా ఆంధ్రప్రదేశ్‌కు కొన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తాను. అదే విధంగా గుజరాత్ వాళ్లు కూడా ఆక్వా రంగంలో పెట్టుబడులను ఆకర్షించడానికి ఆంధ్రప్రదేశ్‌కు రావచ్చు. ఇదే విధంగా మనం పనిచేయాలి. ఒక రాష్ట్రం ఏదైనా కొత్తగా చేసి మంచి ఫలితాలు సాధిస్తే, ఇతర రాష్ట్రాలు త్వరగా నేర్చుకుంటాయి.

**2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఏపీ :** వచ్చే పదేళ్లలో వేగంగా అభివృద్ధి చెందే ఉద్యోగ రంగాల విషయానికి వస్తే.. ఏపీలో 23 క్లస్టర్లు ఉన్నాయి. సాంప్రదాయ తయారీ రంగాలైన సిమెంట్ నుంచి ఆటోమొబైల్, మెటీరియల్ సైన్సెస్ వరకు విస్తృతమైన రంగాలు ఉన్నాయి. రాష్ట్రంలో రేర్ ఎర్త్, మినరల్ క్లస్టర్ కూడా అభివృద్ధి చెందుతోంది. బయోమెడికల్, ఫార్మా, ఏఐ, డేటా సెంటర్లు వంటి రంగాలు కూడా ఉన్నాయి. గూగుల్ ఏపీలో భారీ పెట్టుబడులు పెడుతోంది. దాని తర్వాత మరికొన్ని పెట్టుబడులు కూడా వస్తున్నాయి. క్వాంటం టెక్నాలజీ కూడా రాష్ట్రానికి వస్తోంది. అమరావతిలో క్వాంటమ్ రంగాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఐబీఎం నుంచి ప్రపంచంలోని తొలి 150-క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావడానికి కృషిచేస్తున్నాం. కేవలం కంప్యూటర్‌ను తీసుకురావడమే కాదు... పూర్తి క్వాంటం ఎకోసిస్టమ్ ను నిర్మిస్తాం. తయారీ రంగం విషయానికి వస్తే.. క్రయోజెనిక్స్, మెటీరియల్ సైన్సెస్ వంటి రంగాలపై దృష్టి పెట్టాలి. క్వాంటం టెక్నాలజీకి సంబంధించిన వినియోగాలను అభివృద్ధి చేయాలి. హాస్పిటాలిటీ రంగం కూడా అంతే ముఖ్యమైనది. రాష్ట్రంలో సుమారు 50వేల హోటల్ రూమ్ లను నిర్మిస్తున్నాం. అందువల్ల ఈ రంగంలో కూడా భారీ అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఏపీ 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంది. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం.

క్వాంటం ఎంత ముఖ్యమో, హార్టికల్చర్ కూడా అంతే ముఖ్యం. ఆక్వాకల్చర్ కూడా అంతే ముఖ్యం. అక్టోబర్ 2న హార్టికల్చర్ మిషన్ ను ప్రారంభిస్తున్నాం. దాదాపు లక్ష కోట్ల పెట్టుబడులు ఈ రంగంలో రానున్నాయి. పరిశోధన కూడా ముఖ్యమే. హైదరాబాద్‌లో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఉన్నట్లే, ఆంధ్రప్రదేశ్‌లో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ను అభివృద్ధి చేయాలనుకుంటున్నాం. అదే నమూనాను వ్యవసాయ రంగానికి అనుసరిస్తున్నాం. అందువల్ల మా దృష్టిలో హార్టికల్చర్ నుంచి అగ్రికల్చర్, ఆక్వాకల్చర్ నుంచి క్వాంటమ్ వరకు.. మొత్తం 23 రంగాలు ముఖ్యమైనవే.

**స్థిరమైన ప్రభుత్వంతోనే పేదరికం నిర్మూలన :** 2047 నాటికి సాధారణ ఏపీ పౌరుడి జీవితం ఎలా ఉంటుందనే ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. ఒక తరంలోనే మనం పేదరికాన్ని నిర్మూలించగలమని నా నమ్మకం. ఒక తరం అంటే దాదాపు ఒక దశాబ్దం. ఒక దశాబ్దం పాటు స్థిరమైన, నిరంతరాయమైన ప్రభుత్వం ఉంటే పేదరికాన్ని నిర్మూలించగలం. ఏపీలో మా ఏకైక ప్రధాన లక్ష్యం ఉద్యోగాల కల్పన. అదే మా సింగిల్ అజెండా అని మంత్రి లోకేష్ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ కార్పోరేట్ అఫైర్స్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామి, వివో మొబైల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రెసిడెంట్ అర్జిత్ సేన్, సెల్ కాన్ గ్రూప్ ఫౌండర్, డైరెక్టర్ ఆర్.మురళీకృష్ణ, డీజీఏ గ్రూప్ పార్టనర్ అండ్ హెడ్ ఆఫ్ ఇండియా ఆఫీస్ సునీతా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో గోద్రేజ్ మరిన్ని పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)



ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... గోద్రేజ్ అనుబంధ సంస్థల్లో ఒకటైన అజ్‌టెక్ లైఫ్‌సైన్సెస్ ఆధ్వర్యాన ఒక ఆగ్రో కెమికల్ యూనిట్‌ను ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటు చేయాలని కోరారు. రెడీ టు ఈట్ పాల ఉత్పత్తుల కోసం ఎపిలో ప్రాసెసింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాలను విస్తరించడానికి గోద్రేజ్ ఆగ్రోవెట్ విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. గోద్రేజ్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామి స్పందిస్తూ... గోద్రేజ్ ఱ బాయిస్ గృహోపకరణాలు, ఇంటీరియో ఫర్నిచర్, తాళాలు, పారిశ్రామిక పరికరాల తయారీ, ఇస్రో/డిఆర్‌డిఓ ఏరోస్పేస్ విడి భాగాల తయారీ రంగంలో సేవలందిస్తున్నట్లు చెప్పారు. కొత్తగా పెద్దఎత్తున రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నాం, ఇంటిరియో ద్వారా 2లక్షల చదరపు అడుగుల రిటైల్ స్థలాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పెట్‌కేర్ శ్రేణి, రుణాల కోసం గోద్రేజ్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ ను కొత్తగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గోద్రేజ్ ఆగ్రోవెట్ భారతదేశంలో అతిపెద్ద ఆయిల్ పామ్ ప్రాసెసర్‌గా ఉందని అన్నారు. గత ఏడాది నవంబర్ లో ఆంధ్రప్రదేశ్ లో గోద్రేజ్ ఆగ్రోవెట్, ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాల ఏర్పాటు కోసం రూ.70 కోట్ల విలువైన ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేసినట్లు చెప్పారు. ద్వారకా తిరుమల మండలంలో రూ. 210కోట్ల పెట్టుబడితో మిఠాయి, కోకో బటర్ ప్రత్యామ్నాయ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఎపి ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని రాకేష్ స్వామి చెప్పారు.

## ఏపీలో కాంపొనెంట్స్ తయారీ పార్కు



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఎలక్ట్రానిక్స్ రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తిరుపతిలో వివో మొబైల్స్ కాంపోనెంట్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. వివో సరఫరాదారుల కోసం ఒక 'కాంపోనెంట్స్ తయారీ పార్క్'ను అభివృద్ధి చేయాలని కోరారు. వివో, దాని అనుబంధ సంస్థల జవఅశీతీ వ-ఝశీంఎర్‌వఎ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలసి ఒక 'సప్లై చైన్ సమావేశాన్ని' నిర్వహించాలని మంత్రి లోకేష్ సూచించారు. వివో ఇండియా ప్రెసిడెంట్ అర్జిత్ సేన్ మాట్లాడుతూ... వివో మొబైల్ ఇండియా ప్రతిఏటా 154.2 మిలియన్ యూనిట్ల మొబైల్ యూనిట్లను తయారీ చేస్తూ స్మార్ట్ ఫోన్ మార్కెట్ లో 2025నాటికి అగ్రగామిగా ఉందని తెలిపారు. దేశంలో విక్రయించే ఫోన్లలో 99శాతానికి పైగా (మదర్‌బోర్డులు, 90% పైగా బ్యాటరీలు, ఛార్జర్‌లతో సహా) గ్రేటర్ నోయిడాలోనే తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని అర్జిత్ సేన్ తెలిపారు.

## కాకినాడలో గ్రీన్ అమ్మోనియా



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... కాకినాడలో గ్రీన్-అమ్మోనియా మ్యానుఫ్యాక్చరింగ్, ఎక్స్ పోర్ట్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెట్ అవసరాలను తీర్చడానికి, అక్కడ ఒక ప్రత్యేక ఎరువుల మిశ్రమం, సూక్ష్మపోషకాల ప్లాంట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని సూచించారు. ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో పంట-పోషణ సాంకేతికత, డిజిటల్ వ్యవసాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వైశాలి చోప్రా స్పందిస్తూ... యారా ఇండియా (గురుగ్రామ్) పంట పోషణ, వ్యవసాయ శాస్త్రం, డిజిటల్ వ్యవసాయ రంగాల్లో సేవలందిస్తోంది. 17 రాష్ట్రాలలో 1,500 అవుట్‌లెట్‌ల ద్వారా 5.5 మిలియన్ల మంది రైతులకు డిజిటల్‌గా చేరువైందని తెలిపారు. యుపిలోని బాబ్రాలా కాంప్లెక్స్ ద్వారా 1.6 మిలియన్ టన్నుల యూరియా, 0.66 మిలియన్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు. బయోలాజికల్ క్రాప్ సొల్యూషన్ కోసం కైరాన్ బయోప్రైమ్‌తో భాగస్వామ్యం వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని తెలిపారు.

## ఏపీలో అబాట్ అడుగులు



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** యుఎస్ఎకి చెందిన ప్రముఖ మెడికల్ డివైసెస్, డయాగ్నస్టిక్స్, న్యూట్రిషన్, ఫార్మాస్యూటిక్స్ తయారీ సంస్థ అబాట్ మేనేజింగ్ డైరక్టర్ ఇస్తేయాక్ అంజాద్ తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని AMTZ/EMCలలో ఒకచోట వైద్య పరికరాలు / డయాగ్నోస్టిక్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానించారు. నక్కపల్లిలో రాబోయే బల్క్ డ్రగ్ పార్క్‌లో జెనరిక్ మందుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ప్రతిపాదించారు. ఈ పార్క్‌లో అనుకూలమైన భూమి, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, వినియోగ సేవలు, ఇతర రాష్ట్రాలకు మించిన విధానపరమైన మద్దతు ఉంటాయని తెలిపారు. విశాఖపట్నంలో అబాట్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అబాట్ ఎండి అంజాద్ మాట్లాడుతూ... తమ సంస్థ భారత్ లో 400కు పైగా ఫార్మా బ్రాండ్లు, 12వేలకు పైగా ఉద్యోగులను కలిగి ఉందని తెలిపారు. ప్రస్తుతం గోవా, బద్ది (హిమాచల్ ప్రదేశ్), ఝగాడియా (గుజరాత్)లలో తయారీ కేంద్రాలు, ముంబై, న్యూఢిల్లీలలో కార్యాలయాలు ఉన్నట్లు చెప్పారు. పోషకాహారం, ఫార్మా ఉత్పత్తుల కోసం స్థానిక పేరెన్నికగన్న తయారీసంస్థల్లో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని అంజాద్ చెప్పారు.

## స్మార్ట్ గవర్నెన్స్‌కు శాప్ టెక్నాలజీ



(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ లో స్మార్ట్ గవర్నెన్స్, ఎస్ఎంఇ డిజిటలైజేషన్, నైపుణ్యాభివృద్ధి కోసం శాప్ ఆధ్వర్యాన డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు శాప్ ద్వారా నైపుణ్యాభివృద్ధి, సర్టిఫికేషన్ అందించడానికి ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ తో కలిసి పనిచేయాలని అన్నారు. శాప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చనానా స్పందిస్తూ భారత్ లో ఎంటర్‌ప్రైజెస్, ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, వివిధ ప్రభుత్వ విభాగాలకు తాము సాంకేతిక సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. శాప్ ల్యాబ్స్ ఇండియా - ప్రపంచవ్యాప్తంగా శాప్ రెండవ అతిపెద్ద R&D హబ్ అభివృద్ధి చేస్తోందని, ఇది గ్లోబల్ ప్రాడక్ట్, బిజినెస్ AI విడుదలకు దోహదపడుతుందని తెలిపారు. బెంగళూరులో కొత్తగా 15వేల సీట్లతో R&D, ఇన్నోవేషన్ క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.

# రోడ్ల పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదిక



- వాయుగుండం వేళ ఆర్అండ్‌బీ శాఖ అప్రమత్తం
- 690 కి.మీ. రహదారులకు నష్టం
- పునరుద్ధరణకు రూ.402.18 కోట్ల ప్రాథమిక అంచనా
- 614 సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- క్షేత్రస్థాయి అధికారులతో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమీక్ష

**అమరావతి, సెప్టెంబరు 24(జర్నలిస్ట్ ఫైల్)** : తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆర్అండ్‌బీ శాఖను పూర్తిస్థాయిలో అప్రమత్తం చేసినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజల రాకపోకలకు అంతరాయం లేకుండా, రహదారులపై సురక్షిత ప్రయాణం ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలోని ఆర్అండ్‌బీ శాఖ కార్యాలయం నుంచి ఉన్నతాధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్అండ్‌బీ రహదారులను నిరంతరం పర్యవేక్షించాలని, ముఖ్యంగా తీర ప్రాంత రహదారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా రహదారి కోతలు, గండ్లు ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని, ఎక్కడైనా రాకపోకలకు అంతరాయం ఏర్పడితే తక్షణమే పునరుద్ధరించాలని ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న సీడీ పనుల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, కల్వర్టులు, కాజ్‌వేల వద్ద ఫ్లడ్ లెవల్ సూచికలను తనిఖీ చేసి అవసరమైన చోట ఏర్పాటు చేయాలని సూచించారు.

**690 కి.మీ. రహదారులకు నష్టం :** రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సుమారు 690 కి.మీ. మేర ఆర్అండ్‌బీ రహదారులు దెబ్బతిన్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. వీటిలో శ్రీకాకుళం జిల్లాలోనే 250 కి.మీ. మేర రహదారులు దెబ్బతిన్నట్లు తెలిపారు. 8 చోట్ల తీవ్ర గుంతలు ఏర్పడి రహదారులు కొట్టుకుపోగా, మరో చోట రహదారి కోతకు గురైనట్లు వెల్లడించారు. వీటిలో మూడు చోట్ల పునరుద్ధరణ పనులు ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపారు.

భారీ వర్షాలు, వరదల కారణంగా 85 చోట్ల సీడీ వర్క్స్ దెబ్బతినగా, 62 చోట్ల పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 59 చోట్ల రహదారులకు అడ్డంగా చెట్లు పడగా, 58 చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించినట్లు వివరించారు.

**రూ.402.18 కోట్లతో పునరుద్ధరణ :** వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారుల తాత్కాలిక పునరుద్ధరణకు రూ. 34.38 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ. 291.87 కోట్లు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు. తీవ్ర వాయుగుండం కారణంగా ఆర్అండ్‌బీ రహదారుల పునరుద్ధరణకు మొత్తంగా రూ. 402.18 కోట్ల వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా వేసినట్లు వెల్లడించారు.

శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రహదారులకు అధికంగా నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.


**614 సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు :** రాష్ట్రవ్యాప్తంగా 614 సమస్యాత్మక, ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రహదారి కోతలు, వరదలు, చెట్లు, మట్టి, కొండచరియలు పడిపోయే ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అడ్డంకులను తొలగించేందుకు 550 జేసీబీలు, 596 పవర్ సాల్స్ సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 78 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించినట్లు అధికారులు వెల్లడించారు. ఆర్అండ్‌బీ అనుబంధ విభాగాలతో 36 సమన్వయ సమావేశాలు నిర్వహిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన కార్పొరేషన్లలో 24 గంటలూ పనిచేసే టోల్‌ఫ్రీ సేవలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

**ట్రాఫిక్ పునరుద్ధరణకు తొలి ప్రాధాన్యత :** రహదారులు దెబ్బతిన్నా, రాకపోకలు నిలిచిపోయినా ముందుగా ట్రాఫిక్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అనంతరం శాశ్వత మరమ్మతులు చేపట్టాలని సూచించారు. రహదారుల వెంట ప్రమాదకరంగా ఉన్న చెట్లు, కొమ్మలను తొలగించాలని, ఇసుక సంచులు, ఆర్‌సీసీ పైపులు, సరుగుడు కర్రలు వంటి అత్యవసర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

క్రేన్లు, జేసీబీలు, ప్రొక్లైనర్లు, హ్యాక్సాలు, పవర్ సాలు, స్టీల్ క్రిబ్స్, గొలుసులు తదితర పరికరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆర్అండ్‌బీ అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితులను స్వయంగా పర్యవేక్షించాలని, జిల్లా యంత్రాంగం, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు.

## పిట్టలవానిపాలెం మండల ప్రత్యేక అధికారిగా బాపట్ల డిడిఓ విజయలక్ష్మి



**పిట్టలవానిపాలెం (జర్నలిస్ట్ ఫైల్ ):**బాపట్ల డిడిఓ సి.హెచ్. విజయలక్ష్మి పిట్టలవానిపాలెం మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో గురువారం ఆమె మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తొలి సమావేశంలో మండల అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు మరియు కార్యాలయ సిబ్బందితో ఆమె మాట్లాడారు. మండల సర్వతోముఖాభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారుల సూచనల మేరకు ప్రమాదకరంగా ఉన్న కరెంటు స్తంభాలు, వ్రేలాడుతున్న వైర్ల వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగకుండా గ్రామ ప్రజలకు తగు అవగాహన కల్పించాలని సూచించారు.

స్వచ్ఛరథం, బిన్ బాగ్ సిస్టమ్, 'స్వచ్ఛత హి సేవా' తదితర కార్యక్రమాలను గ్రామాల్లో సమర్థవంతంగా అమలు చేసి మండల అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు అధికారులెవరూ ముందస్తు అనుమతి లేకుండా సెలవులు పెట్టరాదని, అందరూ తూచా తప్పకుండా హెడ్‌క్వార్టర్స్‌లోనే అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, ఎంపీడీవో, ఏపీవో, మండల పరిషత్ సూపరింటెండెంట్, ఏఈ (పీఆర్-ఇన్‌ఛార్జ్), పంచాయతీ కార్యదర్శులు మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడులకు పంచముఖి వ్యూహం

(మొదటి పేజీ తరువాయి)



విశాఖపట్నంలో నవంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించనున్న 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సన్నాహక కార్యక్రమాలపై గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. భాగస్వామ్య సదస్సు కేవలం ఎంవోయూల కోసం కాకుండా... ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తినింపేలా, ఏపీ బ్రాండింగ్ మరింత పెరిగేలా నిర్వహించాలన్నారు. అలాగే పెట్టుబడులతో పాటు... మిగిలిన అంశాలపైనా సదస్సులో చర్చ జరగాలన్నారు.

**ఎంట్రప్రెన్యూర్లను తీర్చిదిద్దేలా పాఠ్యాంశాలు :** ప్రతీ రీజినల్ కాన్ఫరెన్స్‌లో ఎంఎస్ఎంఈ షోకేస్ పేరుతో ప్రోత్సాహం అందించాలని సీఎం సూచించారు. అలాగే, స్టార్టప్‌లకు పెట్టుబడులు పెట్టేవారి కోసం వినూత్నంగా షార్క్ ట్యాంక్ అనే విధానాన్ని ప్రవేశ పెట్టాలని సీఎం స్పష్టం చేశారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను రీజినల్ కాన్ఫరెన్సులకు అనుసంధానం చేయాలన్నారు. భాగస్వామ్య సదస్సుకు ముందుగానే మరో 30 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన జరిగేలా కార్యాచరణ చేపట్టాలని చెప్పారు. పాఠశాల విద్యార్థులు స్టార్టప్ ఆలోచనలు చేసేలా రీజినల్ సమ్మిట్ ఉండాలని, 7వ తరగతి నుంచే విద్యార్థులకు ప్రేరణ ఇచ్చేలా ఎంట్రప్రెన్యూర్షిప్‌కు సంబంధించి పాఠ్యాంశాలు ప్రవేశ పెట్టాలన్నారు. 'ఇన్వెస్ట్ కడప' తరహా కార్యక్రమాలను అన్ని జిల్లాల్లోనూ నిర్వహిస్తే మరింతగా పెట్టుబడులను ఆకర్షించ వచ్చన్నారు.

**వేగంగా పెట్టుబడుల గ్రౌండింగ్ :** సమ్మిట్‌కు ముందు రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న పెట్టుబడుల ప్రతిపాదనలను వేగంగా కార్యరూపంలోకి తీసుకురావడం, గతంలో కుదిరిన ఎంవోయూలను కన్వర్ట్ చేయడం, ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులను గ్రౌండ్ చేయడం, రీజినల్ కాన్ఫరెన్సుల ద్వారా కొత్త పెట్టుబడులను ఆకర్షించడం వంటి అంశాలపై సమీక్షలో ప్రధానంగా చర్చించారు. అలాగే, ప్రస్తుత పెట్టుబడుల స్థితిగతులను ముఖ్యమంత్రి పరిశీలించారు. అక్టోబర్ చివరి నాటికి పెట్టుబడి ప్రతిపాదనల్లో 80 శాతం కన్వర్ట్ చేయాలని..., కన్వర్ట్ అయిన ప్రాజెక్టుల్లో 75 శాతం గ్రౌండింగ్ చేసే లక్ష్యంతో శాఖలు పనిచేయాలని సీఎం నిర్దేశించారు. 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో రూ. 22.57 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 714 ప్రాజెక్టులకు ఎంవోయూలు కుదిరాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వీటిలో రూ. 16.6 లక్షల కోట్ల విలువైన 473 ప్రాజెక్టులు కన్వర్ట్ అయ్యాయని చెప్పారు. కన్వర్ట్ అయిన ప్రాజెక్టుల్లో ఇప్పటికే 247 ప్రాజెక్టులు గ్రౌండింగ్ జరిగినట్టు తెలిపారు.

**రీజినల్ కాన్ఫరెన్స్‌ల షెడ్యూల్ :** అక్టోబర్ 7 నుంచి అక్టోబర్ 26 వరకు రీజినల్ కాన్ఫరెన్సులు నిర్వహించనున్నారు. ముందుగా విశాఖపట్నంలో అక్టోబర్ 7న ఏఐ, డేటా సెంటర్లు, ఐటీ -- ఫిన్ టెక్, సెమికండక్టర్స్, జీసీసీ, ఫార్మా, మెడ్ టెక్ ఫోకస్‌గా కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. అక్టోబర్ 12న కాకినాడలో మారిటైమ్, షిప్ బిల్డింగ్, కెమికల్స్, గ్రీన్ హైడ్రోజన్, అమోనియా, ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలకు ప్రయార్టీ ఇవ్వనున్నారు. ఇక అక్టోబర్ 16న గుంటూరులో గవర్నెన్స్, క్యాపిటల్ సిటీ డెవలప్మెంట్, అర్బన్ ఇన్‌ఫ్రా, క్వాంటం వ్యాలీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పైన... అక్టోబర్ 23న అనంతపురంలో ఏరో స్పేస్, డిఫెన్స్, ఆటోమోటివ్, నేచురల్ ఫార్మింగ్, హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, రిన్యువబుల్ ఎనర్జీ.... అక్టోబర్ 26న తిరుపతిలో టూరిజం, హాస్పటాలిటీ, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్, సెమి కండక్టర్, అడ్వాన్స్ మెటీరియల్స్, ఆటోమోటివ్, స్పేస్, ఫుట్ వేర్ రంగాలకు ప్రాధాన్యతనిస్తూ రీజినల్ కాన్ఫరెన్సులు జరగున్నాయి. రీజినల్ కాన్ఫరెన్స్‌లోనే ఎంవోయూలు చేసుకునేలా ఈసారి మార్పులు చేశారు... ప్రధానమైన కొన్ని ప్రాజెక్టుల ఎంవోయూలు సమ్మిట్‌లో చేసుకోవాలని... వివిధ అంశాలపై చర్చలకు ప్రాధాన్యతనిచ్చేలా అలాగే విశాఖ సదస్సు చేపట్టాలని నిర్ణయించారు.

**దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోలతో ప్రచారం :** సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026కు పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ ప్రతినిధులను ఆకర్షించేందుకు ఇప్పటికే దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు. దేశీయంగా చెన్నై, కోయంబత్తూరు, బెంగళూరు నగరాల్లో రోడ్‌షోలు నిర్వహించగా, సెప్టెంబర్ 25న అహ్మదాబాద్, సెప్టెంబర్ 28న హైదరాబాద్, సెప్టెంబర్ 30న ముంబైలో రోడ్‌షోలు నిర్వహించనున్నారు. అంతర్జాతీయంగా సింగపూర్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, తైవాన్‌లలో రోడ్‌షోలు పూర్తయ్యాయి. సెప్టెంబర్ 29-అక్టోబర్ 1 మధ్య స్వీడన్‌లో, అక్టోబర్ 13-14 తేదీల్లో జపాన్‌లో, అక్టోబర్ 15-16 తేదీల్లో చైనాలో రోడ్‌షోలు నిర్వహించనున్నారు. ఇప్పటికే 11 మంది అంతర్జాతీయ మంత్రులు, 26 మంది అంతర్జాతీయ స్పీకర్లు, 21 దేశాల ప్రతినిధులు భాగస్వామ్య సదస్సుకు ఖరారయ్యారు. మరింత అంతర్జాతీయ, దేశీయ భాగస్వామ్యం కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. సింగపూర్, కంబోడియా, మయన్మార్, స్లోవాక్ రిపబ్లిక్, లిథువేనియా, బల్గేరియా, మారిషస్, బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, గ్వాటెమాలా, మొజాంబిక్ తదితర దేశాల నుంచి మంత్రులు, ప్రతినిధులు ఈసారి హాజరవుతున్నారు. ఈసారి 'ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్, థాట్ లీడర్‌షిప్' ప్రధాన థీమ్‌గా నిర్ణయించారు.

**అక్టోబర్ 8న న్యూఢిల్లీలో కర్టెన్ రైజర్ :** సమ్మిట్‌కు ముందు అక్టోబర్ 8న న్యూఢిల్లీలోని భారత్ మండపంలో కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించనున్నారు. దౌత్యవేత్తలు, ప్రభుత్వ ప్రతినిధులు, మీడియా సమక్షంలో ఈ కార్యక్రమం జరగనుంది. మరోవైపు విశాఖలోని కాపులుప్పాడలో నిర్మించ తలపెట్టిన కన్వెన్షన్ సెంటర్.... భవిష్యత్‌లో మిగిలిన అవసరాలకు వినియోగించుకునేలా ఉండాలని సీఎం అధికారులకు సూచించారు. రాజమహేంద్రవరంలో కన్వెన్షన్ సెంటర్ గోదావరి పుష్కరాల కన్నా ముందే పూర్తి కావాలని సీఎం స్పష్టం చేశారు. అలాగే అమరావతి, తిరుపతి, అనంతపురం కన్వెన్షన్ సెంటర్ల డిజైన్లు కూడా ప్రత్యేకంగా నిలిచేలా ఉండాలన్నారు.

# వరదలపై అప్రమత్తంగా ఉండాలి

- ఇరిగేషన్ ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్.
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో జలవనరుల శాఖ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాలు, వరద పరిస్థితులపై సమీక్షించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, కడా కమిషనర్ ప్రశాంతి, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వాతావరణ శాఖ నుంచి అందే ముందస్తు సమాచారాన్ని ఎప్పటికప్పుడు తీసుకుంటూ, దానికి అనుగుణంగా వరద నియంత్రణ చర్యలు చేపట్టాలని మంత్రి నిమ్మల సూచించారు. రిజర్వాయర్లు, నదులు, వాగుల్లోకి వచ్చే నీటి ప్రవాహాలను నిరంతరం అంచనా వేస్తూ, పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మున్నేరు నదికి వచ్చే ఇన్‌ఫ్లో, బుడమేరు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అవసరానికి అనుగుణంగా పట్టిసీమ పంపులను ఆపరేట్ చేయాలని మంత్రి నిమ్మల సూచించారు. ఏలేరు రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ప్రాంతంలో నమోదయ్యే వర్షపాతాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా పురుషోత్తపట్నం పంపులను ఆపరేట్ చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వంశధార, నాగావళి, బహుదా, మహేంద్రతనయ నదుల ప్రవాహాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మంత్రి తెలిపారు. ఆయా నదుల పరివాహక ప్రాంతాల్లో వరద పరిస్థితులపై ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని సూచించారు.

ఇరిగేషన్ అధికారులు నిరంతరం వార్ రూమ్‌లో పరిస్థితిని పర్యవేక్షిస్తూ, అవసరమైన సూచనలు క్షేత్రస్థాయి సిబ్బందికి వెంటనే అందించాలని మంత్రి ఆదేశించారు. ఉన్నతాధికారులు సైతం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. భారీ వర్షాలు, ఆకస్మిక వరదల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు.

## తల్లి కుమారుడు మరణించడంపై మాజీ ఎమ్మెల్సీ సంతాపం

**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):**బాపట్ల మండలం చెరువు పాలెం గ్రామంలో తల్లి రమాదేవి,కుమారుడు వెంకటేశ్వర్లు విద్యుత్ షాక్ తో చనిపోవడం బాధాకరమని మాజీ ఎమ్మెల్సీ భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ సంతాపం వ్యక్తం చేశారు. నియోజవర్గంలోని ప్రజలు వర్షాలు, గాలులు వీచే సమయంలో కరెంటు స్తంభాల వద్ద చెట్ల కింద ఉండరాదు అన్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ గాలులు వీస్తున్న సమయంలో సిబ్బందిని వార్డులలో, గ్రామాలలో కరెంటు స్తంభాలు, విద్యుత్ వైర్లపై పర్యవేక్షణ చేయిస్తూ ప్రజలకు ఎటువంటి నష్టం కలగకుండా జాగ్రత్తలు వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు కూడా ప్రజలకు విద్యుత్ పరికరాలపై,విద్యుత్ వైర్లపై కరెంటు స్తంభాల వలన జరిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. చెరువు ఉప్పరపాలెం గ్రామంలో జరిగిన ప్రమాదంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు బాధిత కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నట్లు ప్రకటించారు.

# ప్రవాహాలు ఒడిసిపట్టండి

- ప్రవాహాలతో రిజర్వాయర్లు, చెరువులు నింపాలి
- చెరువులు నింపేందుకు మొబైల్ లిఫ్ట్ లు
- పడుతున్న వర్షాలతో భూగర్భజలాల రీఛార్జ్
- రాష్ట్రంలో వర్షాలు, నీటి ప్రవాహాలపై ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు



**అమరావతి, సెప్టెంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** వర్షాల కారణంగా వస్తున్న ప్రవాహాలతో రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్ని నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కృష్ణా, గోదావరి డెల్టాలోని రిజర్వాయర్లతో పాటు పరిధిలో ఉన్న వివిధ నీటి వనరుల్ని కూడా నింపాలని స్పష్టం చేశారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఏఐ ఆధారిత సాంకేతికత వినియోగం, డేటా అనలిటిక్స్, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే వ్యూహాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్ష ప్రభావంపై సీఎం చర్చించారు. తీవ్ర వాయుగుండం కారణంగా రాష్ట్రంలో గడచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా భూగర్భజలాలు కొంత మేర పెరిగాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రకాశం బ్యారేజి సహా మున్నేరు సహా ఇతర క్యాచ్ మెంట్ ఏరియా నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని అన్నారు. ప్రాజెక్టుల దిగువన ఉన్న అన్ని నీటి వనరుల్లో వర్షపు నీటిని నిల్వ చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. అవసరమైన చోట మోటార్లను వాడి నీటిని లిఫ్ట్ చేయాలని స్పష్టం చేశారు. గోదావరి నుంచి వస్తున్న ప్రవాహాల ద్వారా 24 టీఎంసీల నీటిని ఏలేరు రిజర్వాయర్ నింపాలని స్పష్టం చేశారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకూ నీటి వనరుల్లోకి నీటిని పంపాలన్నారు. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో వర్షాలు అధికంగా నమోదు అయ్యాయని అధికారులు వివరించారు. ముఖ్యంగా విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, మన్యం, కాకినాడ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ సహా వివిధ జిల్లాల్లో తీవ్ర వర్ష ప్రభావం కనిపించిందని తెలిపారు.

**గోదావరి, కృష్ణా, నాగావళి, వంశధార బేసిన్లపై ప్రత్యేక దృష్టి:** ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాలు, గాలుల తీవ్రత, నదులు-వాగుల్లో పెరుగుతున్న ప్రవాహాలు, రిజర్వాయర్లలోకి చేరుతున్న వరద నీరు, రాబోయే రోజుల్లో అంచనా వేసిన వర్షపాతంపై ముఖ్యమంత్రి సమీక్షించారు. తాజా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టేలా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల ప్రభావంతో గోదావరి బేసిన్‌లోని శబరి, ఇంద్రావతి, ఏలేరు, తాండవ, ఎర్రకాల్వ, పంపా, మేఘాద్రిగడ్డ తదితర రిజర్వాయర్లకు భారీగా వరద నీరు చేరుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఏలేరు రిజర్వాయర్‌కు 21,200-26,500 క్యూసెక్కుల మేర, తాండవకు 6,000-7,500 క్యూసెక్కులు, మేఘాద్రిగడ్డకు 2,400-3,000 క్యూసెక్కులు, పంపాకు 3,100-3,875 క్యూసెక్కులు వరకు ఇన్‌ఫ్లో వస్తుందని అంచనా వేస్తున్నారు. ఉత్తర కోస్తా రిజర్వాయర్లకు కూడా రాబోయే రోజుల్లో ఇన్‌ఫ్లో గణనీయంగా పెరుగుతుందని వెల్లడించారు. నాగావళి-వంశధార బేసిన్లలో వర్షాల ప్రభావంతో ప్రవాహాలు పెరగనున్నాయని వివరిచారు. గొట్టా బ్యారేజీకి సెప్టెంబర్ 25 ఉదయం నాటికి వార్నింగ్ లెవల్-1 చేరుకునే అవకాశం ఉందని అంచనా వేశారు. భద్రాచలం వద్ద సెప్టెంబర్ 26 మధ్యాహ్నానికి వార్నింగ్ లెవల్-1, అదే రోజు రాత్రికి వార్నింగ్ లెవల్-2 దాటే అవకాశం ఉందని తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 27 ఉదయం వార్నింగ్ లెవల్-1, సాయంత్రం వార్నింగ్ లెవల్-2 దాటే అవకాశం ఉందని అంచనా వేశారు. శబరి నదిపై కుంటా వద్ద సెప్టెంబర్ 26 ఉదయానికి వార్నింగ్ స్థాయికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

**ప్రకృతి వ్యవసాయం చేయాలి... భూసారాన్ని పెంచాలి :** ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులను మార్చడం సాధ్యం కాకపోయినా.. వాటి ప్రభావాన్ని తగ్గించేలా అంతర్గత పరిస్థితులను మార్చుకోవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. భూసారాన్ని పెంచడం, సాయిల్ టెస్టింగ్ ఆధారంగా ప్రత్యామ్నాయ పంటలను సూచించడం, బయోచార్, ప్రకృతి వ్యవసాయం వంటి విధానాల ద్వారా ఎల్‌నినో ప్రభావాన్ని కొంతమేర తగ్గించవచ్చని తెలిపారు. ఈ విధానాన్ని రాష్ట్రంలో పైలట్‌గా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి వ్యవసాయ రంగానికి అవసరమైన సూచనలు అందించేలా సాంకేతికతను వినియోగించుకోవాలని సీఎం సూచించారు. వ్యవసాయానికి సంబంధించిన సమాచారంతో పాటు సాగునీటి లభ్యత, రిజర్వాయర్ల పరిస్థితి తదితర వివరాల డేటా పొందుపరచాలని ఆదేశించారు. అక్టోబరు 2 తేదీన ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు శంకుస్థాపన చేయనున్నామని, అదే రోజు రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. మైక్రోసాఫ్ట్ సహకారంతో రూపొందించిన ఏఐ స్టాక్ ద్వారా కలిగే లాభాలను వివరిస్తూ డెమో ఇవ్వాలని సీఎం సూచించారు. భూగర్భజలాలు సహా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలపైనా అమెరికాలోని పృథ్వీ అనే యువకుడు రూపొందించిన యాప్ లను సీఎం పరిశీలించారు. వివిధ శాఖల నుంచి సేకరించిన డేటా సెట్లను సమన్వయం చేసుకుంటూ నాసా ఉపగ్రహ చిత్రాలను అనుసంధానం చేస్తూ ఈ యాప్ ను రూపొందించిన పృథ్విని సీఎం అభినందించారు. భూగర్భజలాల స్థాయిలు, వాటి మార్పులు, ప్రాంతాల వారీ పరిస్థితులను విశ్లేషించడం ద్వారా భవిష్యత్తులో నీటి నిర్వహణకు మెరుగైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని సీఎం స్పష్టం చేశారు.

**శాప్ ద్వారా క్రీడా క్యాలెండర్ :** పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపరచాలని సీఎం ఆదేశించారు. విద్యుత్ టారిఫ్‌ను పెంచకపోయినా సేవల్లో లోపాల కారణంగా ప్రజల్లో సంతృప్తి తగ్గుతోందని, సరఫరా నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో 287.214 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఉన్న నేపథ్యంలో.. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీటి లభ్యతపైనా దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఇసుక లభ్యత ధరలు, సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. శాప్ ఆధ్వర్యంలో ఏడాది క్రీడా క్యాలెండర్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలోనూ క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు. 175 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరును మెరుగుపరిచేలా స్పష్టమైన సూచనలు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. నోడల్ అధికారుల ఆధ్వర్యంలో నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి పనితీరులో మార్పు తీసుకురావాలని ఆదేశించారు. గృహనిర్మాణంలో జీరామ్‌జీ ద్వారా మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టాలని సీఎం సూచించారు. డేటా ఆధారిత పాలనలో భాగంగా ప్రభుత్వ శాఖల్లో ఏఐ లివింగ్ ల్యాబ్స్ యాప్‌ల వినియోగం, సమాచార విశ్లేషణను మరింత విస్తరించాలని సీఎం స్పష్టం చేశారు.



# దీన్‌దయాళ్‌జీ చూపిన మార్గమే

# వికసిత భారత నిర్మాణానికి దిక్సూచి

భారత రాజకీయ చరిత్రలో కొందరు నాయకులు వారు నిర్వహించిన పదవుల ద్వారా గుర్తుండిపోతారు. మరికొందరు తమ ఆలోచనలు, సిద్ధాంతాలు, జీవన విలువలతో తరతరాలకు మార్గదర్శకులుగా నిలుస్తారు. పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ అలాంటి మహోన్నత వ్యక్తిత్వం. నిరాడంబర జీవితం, నిస్వార్థ దేశసేవ, స్వచ్ఛమైన రాజకీయ విలువలు, భారతీయ సంస్కృతిపై అచంచల విశ్వాసం, కార్యకర్తల పట్ల అపారమైన ప్రేమ -- ఇవన్నీ ఆయన వ్యక్తిత్వానికి ప్రత్యేకతను తీసుకువచ్చాయి.

1916 సెప్టెంబర్ 25న జన్మించిన దీన్‌దయాళ్‌జీ చిన్ననాటి నుంచే అనేక కష్టాలను ఎదుర్కొన్నారు. జీవితంలో ఎన్నో వడిదుడుకులు ఎదురైనా ఆయన ఎక్కడా కుంగిపోలేదు. కష్టాలను అధిగమిస్తూ దేశసేవనే తన జీవిత ధ్యేయంగా స్వీకరించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ద్వారా సామాజిక సేవలో ప్రవేశించి, అనంతరం భారతీయ జనసంఘ్ నిర్మాణం, విస్తరణలో కీలక పాత్ర పోషించారు. 1953 నుంచి 1968 వరకు జనసంఘ్‌లో వివిధ కీలక బాధ్యతలను నిర్వహిస్తూ పార్టీని దేశవ్యాప్తంగా బలోపేతం చేశారు.

**సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిన మహనీయుడు** : కేవలం సిద్ధాంతాలను పదేపదే వల్లించడం వల్ల సమాజం మారదు. సిద్ధాంతాలను ఆదర్శ ఆచరణలో పెట్టినప్పుడే అవి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తాయి. దీన్‌దయాళ్‌జీ తన జీవితంతో ఈ సత్యాన్ని నిరూపించారు.

"ఖాళీ సిద్ధాంతాలను పదేపదే చెప్పడం వల్ల వసుంధర రూపం మారదు. వాటిని ఆదర్శ ఆచరణలో పెట్టినప్పుడే ఒక దీన్‌దయాళ్ ఉద్భవిస్తాడు" అనే భావానికి ఆయన జీవితం ప్రత్యక్ష నిదర్శనం.

సంఘ్ ఏ కార్యానికి తనను నియమించిందో, దానినే తన జీవిత కార్యంగా స్వీకరించి సంపూర్ణంగా అంకితమై పనిచేశారు. వ్యక్తిగత ఆశలు, పదవులు, ప్రయోజనాల కంటే సంస్థ, సమాజం, దేశం ఆయనకు ఎప్పుడూ ముందుండేవి.

**భారతీయ రాజకీయ చింతనకు కొత్త దిశ -- ఏకాత్మ మానవతావాదం** : స్వాతంత్ర్యం అనంతరం భారతదేశం ఏ అభివృద్ధి నమూనాను అనుసరించాలి? భారతీయ సమాజ స్వభావానికి అనుగుణమైన రాజకీయ, ఆర్థిక వ్యవస్థ ఎలా ఉండాలి? అనే ప్రశ్నలకు దీన్‌దయాళ్‌జీ తనదైన భారతీయ దృక్పథంతో సమాధానం ఇచ్చారు.

పాశ్చాత్య దేశాల సిద్ధాంతాలను యథాతథంగా అనుసరించకుండా, భారతీయ జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, సమాజ స్వభావానికి అనుగుణంగా దేశ అభివృద్ధి జరగాలని ఆయన ఆకాంక్షించారు.

క్యాపిటలిజం, కమ్యూనిజం వంటి సిద్ధాంతాల్లోని పరిమితులను అధిగమిస్తూ, వ్యక్తి–సమాజం–ప్రకృతి–పరమాత్మ మధ్య సజీవ సమన్వయాన్ని ప్రతిపాదించిన సమగ్ర భారతీయ ఆలోచనా విధానమే ఏకాత్మ మానవతావాదం.

1965లో విజయవాడలో జరిగిన భారతీయ జనసంఘ్ జాతీయ మహాసభలో ఈ సిద్ధాంతం అధికారికంగా స్వీకరించబడటం ఆంధ్రప్రదేశ్‌కు లభించిన ప్రత్యేక చారిత్రక గౌరవం. నేడు ఈ సిద్ధాంతం ఆవిర్భవించి ఆరు దశాబ్దాలు పూర్తవుతున్న సందర్భంగా విజయవాడలో "పునర్దర్శనం" సమ్మేళనం నిర్వహించడం ఒక చారిత్రక సందర్భం. నాటి తరం ఆలోచనలను నేటి తరానికి అందించే అవకాశం లభించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.

**మనిషే అభివృద్ధికి కేంద్రబిందువు** : దీన్‌దయాళ్‌జీ దృష్టిలో అభివృద్ధి అంటే కేవలం సంపద పెరగడం కాదు. మనిషి శరీరం, మనసు, బుద్ధి, ఆత్మ – అన్ని కోణాల్లో సమగ్ర అభివృద్ధి చెందాలి. వ్యక్తి అభివృద్ధి కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధితో అనుసంధానమై ఉండాలి.

ప్రకృతిని దోచుకోవడం కాదు, ప్రకృతితో సమన్వయంగా జీవించడం ఆయన ఆలోచనలో ముఖ్యమైన అంశం. అందుకే నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న పర్యావరణ సంక్షోభం, సామాజిక అసమానతలు, ఆర్థిక అసమతుల్యతల నేపథ్యంలో ఏకాత్మ మానవతావాదం మరింత ప్రాసంగికంగా మారింది.

ఆధునిక సాంకేతికత, ఆర్థిక ప్రగతి అవసరమే. అయితే వాటితో పాటు మానవ గౌరవం, సామాజిక బాధ్యత, ప్రకృతి పరిరక్షణ, భారతీయ విలువలు కూడా ముందుకు సాగాలి.

**అంత్యోదయమే నిజమైన అభివృద్ధి** : సమాజంలోని అత్యంత వెనుకబడిన వ్యక్తి అభ్యున్నతి సాధించినప్పుడే దేశ అభివృద్ధి సంపూర్ణమవుతుందని దీన్‌దయాళ్‌జీ విశ్వసించారు. అందుకే అంత్యోదయం ఆయన ఆలోచనా విధానంలో అత్యంత కీలకమైన భావనగా నిలిచింది.

పేదలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, అణగారిన వర్గాలు – సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు లభించాలి. అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తి వరకు చేరాలి. ఇదే అంత్యోదయ స్ఫూర్తి.

నేడు దేశ అభివృద్ధిలో పేదల సంక్షేమం, సామాజిక సాధికారత, స్వావలంబన, మౌలిక సదుపాయాల విస్తరణ, చివరి వ్యక్తికి ప్రభుత్వ ప్రయోజనాలు చేరేలా చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత లభించడం దీన్‌దయాళ్‌జీ ఆలోచనల సమకాలీనతను తెలియజేస్తోంది.

**రాజకీయ ప్రత్యర్థులు శత్రువులు కారు** : దీన్‌దయాళ్‌జీ రాజకీయ హుందాతనానికి ఆయన చూపిన అనేక సంఘటనలు నిదర్శనాలు. 1967లో వివిధ రాష్ట్రాల్లో రాజకీయ సమీకరణాలు మారుతున్న సమయంలో భిన్న సిద్ధాంతాలకు చెందిన పార్టీలతో రాజకీయంగా కలిసి పనిచేసిన సందర్భాలు ఉన్నాయి. కమ్యూనిస్టులతో రాజకీయ పోటీ ఉన్నప్పటికీ, వారిని శత్రువులుగా చూడకుండా "కమ్యూనిస్టులు రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే, శత్రువులు కాదు" అనే ఉన్నతమైన రాజకీయ సంస్కృతిని ఆయన ప్రదర్శించారు.

ప్రజాస్వామ్యంలో సిద్ధాంతపరమైన భేదాలు సహజం. కానీ వ్యక్తిగత ద్వేషం, శత్రుత్వం రాజకీయాల్లో ఉండకూడదనే విలువను ఆయన తన ఆచరణ ద్వారా చూపించారు.

నేటి రాజకీయాల్లో కూడా ఈ హుందాతనం, విలువలు, పరస్పర గౌరవం మరింత అవసరం.

విమర్శలను మెట్లుగా మార్చుకోవాలని కార్యకర్తలకు సందేశం

దీన్‌దయాళ్‌జీ కేవలం సిద్ధాంతకర్త మాత్రమే కాదు. వేలాది కార్యకర్తలకు మనోధైర్యం నింపిన గొప్ప నాయకుడు.

విమర్శలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా, వాటినే మన బలంగా మార్చుకోవాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చేవారు.

"మనపై విమర్శలు చేస్తే కృంగిపోకూడదు. ఒక్కో విమర్శను ఒక్కో ఇటుకగా మార్చుకుని, ఒక్కో ఇటుకపై అడుగుపెడుతూ ముందుకు సాగాలి" అనే ఆయన సందేశం నేటి కార్యకర్తలకు కూడా ఎంతో స్ఫూర్తిదాయకం.

తాష్కెంట్ ఒప్పందం అనంతరం జరిగిన జనసంఘ్ సభలో కార్యకర్తలను సముదాయించిన తీరు ఆయన నాయకత్వంలోని హుందాతనాన్ని, కార్యకర్తల పట్ల ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబిస్తుంది.

**రాజకీయాల్లో విలువలకు ప్రతీక** : నేటి రాజకీయ వాతావరణంలో చిన్న విషయాలు కూడా తీవ్ర వివాదాలకు దారితీస్తున్నాయి. కానీ దీన్‌దయాళ్‌జీ కాలంలో రాజకీయ ప్రత్యర్థిపై కూడా ఒక నైతిక బాధ్యతతో వ్యవహరించే సంస్కృతి ఉండేది.

ఆర్గనైజర్ పత్రికలో ఆనాటి హోం మంత్రి చవాన్ ఉద్దేశించి గాడిద రూపంలో కార్టూన్ వచ్చిన సందర్భంలో కూడా ఆయన దానిని వ్యతిరేకించి ఆవిధంగా కార్టూన్ వేయడం భావ్యం కాదన్న విషయం సూటిగా చెప్పారు అంటే ఎలాంటి రాజకీయ మర్యాద పాటించారు అనే విషయం ఈ ఉదాహరణ ద్వారా అర్థం అవుతుంది

రాజకీయాల్లో విమర్శ ఉండవచ్చు. కానీ ప్రత్యర్థిని కించపరచడం, వ్యక్తిగత దూషణలకు దిగడం కాకుండా, సిద్ధాంతాల ఆధారంగా చర్చించడం ప్రజాస్వామ్యానికి బలం.

**ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక అనుబంధం** : పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ గారితో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఏకాత్మ మానవతావాదం అధికారికంగా స్వీకరించబడిన చారిత్రక వేదికగా విజయవాడ నిలిచింది.

అందువల్ల ఆ సిద్ధాంతం ఆవిర్భవించి 60 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా విజయవాడలో నిర్వహించే "పునర్దర్శనం" సమ్మేళనం కేవలం ఒక కార్యక్రమం కాదు. అది ఒక ఆలోచనా పునర్విమర్శ.

నాటి తరం దేశం గురించి, సమాజం గురించి, అభివృద్ధి గురించి చేసిన ఆలోచనలను నేటి తరానికి పరిచయం చేయడం అత్యవసరం. ముఖ్యంగా యువతకు దీన్‌దయాళ్‌జీ ఆలోచనలు చేరాలి. ఆయన జీవితం, రచనలు, ప్రసంగాలు, రాజకీయ ప్రయాణంపై మరింత లోతైన అధ్యయనం జరగాలి.

**వికసిత భారత్‌కు దీన్‌దయాళ్‌జీ ఆలోచనలే దిక్సూచి** : నేడు భారతదేశం ప్రపంచంలో ఒక శక్తివంతమైన దేశంగా ఎదుగుతున్న వేళ, అభివృద్ధి ప్రయాణం భారతీయ మూలాలను మరచిపోకుండా సాగాలి.

ఆర్థిక ప్రగతితో పాటు సామాజిక సమరసత, సాంస్కృతిక ఆత్మవిశ్వాసం, పర్యావరణ పరిరక్షణ, మానవ గౌరవం, స్వావలంబన – ఇవన్నీ సమానంగా ముందుకు సాగాలి.

యువతకు అవకాశాలు, రైతులకు బలం, మహిళలకు సాధికారత, కార్మికులకు గౌరవం, పేదలకు భద్రత, అట్టడుగు వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలి. దేశ అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికి చేరాలి.

ఇదే దీన్‌దయాళ్‌జీ ప్రతిపాదించిన సమగ్ర అభివృద్ధి భావనకు నిజమైన అర్థం.

**స్మరణ కాదు - ఆచరణే నిజమైన నివాళి** : 1968 ఫిబ్రవరి 11న దీన్‌దయాళ్‌జీ భౌతికంగా మనకు దూరమైనప్పటికీ, ఆయన ఆలోచనలు భారతీయ రాజకీయ, సామాజిక చింతనలో శాశ్వతంగా నిలిచిపోయాయి.

ఆయనను జయంతి, వర్ధంతి సందర్భాల్లో స్మరించుకోవడం మాత్రమే సరిపోదు. ఆయన చూపిన మార్గంలో నడవాలి. సమాజంలోని చివరి వ్యక్తి కోసం పనిచేయాలి. భారతీయ విలువలను గౌరవించాలి. ప్రజా జీవితంలో నిజాయితీ, నిబద్ధత, సేవాభావాన్ని పెంపొందించాలి.

దీన్‌దయాళ్‌జీ జీవితం మనకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుంది – సిద్ధాంతం మాటల్లో కాదు, ఆచరణలో కనిపించాలి.

అంత్యోదయ స్ఫూర్తితో, ఏకాత్మ మానవతావాద మార్గదర్శకత్వంలో బలమైన, సమృద్ధమైన, సమగ్ర భారతదేశాన్ని నిర్మించడం మనందరి బాధ్యత.

దీన్‌దయాళ్‌జీ ఆలోచనలు భారతదేశ గతానికి సంబంధించినవి మాత్రమే కావు. అవి భారతదేశ భవిష్యత్తుకు దిక్సూచి.


విజయవాడలో పుట్టిన ఆ ఆలోచనను మరోసారి పునర్దర్శనం చేసుకుని, నేటి తరానికి అందించి, వికసిత భారత్ నిర్మాణానికి దానిని ఆచరణలో పెట్టడమే పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ గారికి మనం అందించే నిజమైన నివాళి.

"కేవలం సిద్ధాంతాలను పదేపదే వల్లించడం వల్ల ఈ వసుంధర రూపం సుందరంగా మారదు. ఆ సిద్ధాంతాలను ఆదర్శ ఆచరణలో పెట్టినప్పుడే ఒక దీన్‌దయాళ్ ఉద్భవిస్తాడు."



**పివిఎన్ మాధవ్**
బిజెపి రాష్ట్ర అధ్యక్షులు
ఆంధ్రప్రదేశ్

## కన్నాకు ఎమ్మెల్యే గళ్లా మాధవి పరామర్శ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** : ఇటీవల భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని గుంటూరులోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు టీడీ జనార్ధన్ పరామర్శించారు.

ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలోకి రావాలని వారు ఆకాంక్షించారు.

## వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అండగా బీజేపీ

- **పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి**
- **టెలికాన్ఫరెన్స్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సూచనలు**



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్)** : వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, గోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సూచించారు. గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో వర్షాల పరిస్థితిపై సమీక్షించారు.

సకాలంలో వర్షాలు లేకపోవడంతో ఈ ఏడాది లోటు వర్షపాతం నమోదైన నేపథ్యంలో ప్రస్తుత వర్షాలను ప్రజలు స్వాగతిస్తున్నారని మాధవ్ పేర్కొన్నారు. అయితే భారీ వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో ముంపు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వర్షాలు, వరదల ప్రభావిత ప్రాంతాల్లో పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించాలని ఆయన సూచించారు. అవసరమైన చోట తక్షణ సహాయ చర్యలు చేపట్టడంతో పాటు ముంపు పరిస్థితులు, నష్టం వివరాలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

తమ మండలాలు, గ్రామాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వానికి తెలియజేయాలని, అవసరమైన ప్రాంతాల్లో ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకుని ప్రజలకు సహాయం అందించాలని మాధవ్ సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ వర్షాలు తగ్గే వరకు పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## మత విశ్వాసాలను గౌరవిస్తూ మానవతా సమాజ నిర్మాణానికి కృషి చేయాలి




- **భిన్న ఆరాధనా పద్ధతులన్నీ పరమాత్మను చేరే మార్గాలే**
- **'వన్ ఎర్త్ - వన్ ఫ్యూచర్ - వన్ ఫ్యామిలీ' భావనను పెంపొందించాలి**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** :దేశంలో అన్ని మతాల విశ్వాసాలు, ఆరాధనా పద్ధతులను పరస్పరం గౌరవించుకుంటూ సామరస్యపూర్వక సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు.

గ్యారమీ పండుగ 11వ రోజు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 11వ రోజుకు వివిధ మత విశ్వాసాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ఇటువంటి పవిత్రమైన రోజున కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అన్ని మతాల విశ్వాసాలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని తెలిపారు.

"ఆకాశాత్ పతితం తోయం యథా గచ్ఛతి సాగరం..సర్వదేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి" అనే భావనను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పీవీఎన్ మాధవ్ అన్నారు. వివిధ మార్గాల్లో ప్రవహించే నదులన్నీ చివరకు సముద్రాన్ని చేరినట్లే, భిన్నమైన ఆరాధనా పద్ధతులు చివరకు పరమాత్మను చేరే మార్గాలేనని వివరించారు.

పాలు ఏ రంగులో ఉన్నా అందులో చక్కెర కలిసినప్పుడు తీయదనాన్ని పెంచినట్లే.. వివిధ విశ్వాసాలు, సంప్రదాయాలు పరస్పరం కలిసిమెలిసి సమాజంలో మానవతా విలువలను పెంపొందించాలని ఆకాంక్షించారు. ఒకరి ఆరాధనా విధానాన్ని మరొకరు కించపరచడం, భిన్న విశ్వాసాలను తక్కువగా చూడటం వంటి ధోరణులకు స్వస్తి పలకాలని సూచించారు.

ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో దేశంలో మత సామరస్యం, సోదరభావం, పరస్పర గౌరవం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. మత ఘర్షణలకు తావులేని, ప్రతి ఒక్కరి విశ్వాసానికి గౌరవం లభించే ఉన్నతమైన సమాజ నిర్మాణం కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

'వన్ ఎర్త్ – వన్ ఫ్యూచర్ – వన్ ఫ్యామిలీ' అనే భావనతో ప్రపంచ శాంతి, మానవతా విలువలకు భారతదేశం మార్గదర్శకంగా నిలవాలని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పాతూరు నాగభూషణం, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారి దిలీప్, గుంటూరు ప్రాంత పార్టీ ఇన్‌చార్జి వెంకయ్య నాయుడు, స్వామి నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాపట్ల జిల్లా చెరువు ఉప్పరపాలెం విషాదం



- **విద్యుత్ షాక్‌తో తల్లి, కొడుకు మృతి..**
- **తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు**

**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ )**: బాపట్ల మండలం చెరువు ఉప్పరపాలెం గ్రామంలో చోటుచేసుకున్న ఒక హృదయవిదారక ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై తల్లి, కొడుకులు ప్రాణాలు కోల్పోవడం పట్ల బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు తీవ్ర దిగ్భ్రాంతి మరియు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

ఈ దుర్ఘటనకు సంబంధించి ఎమ్మెల్యే కార్యాలయం విడుదల చేసిన వివరాల ప్రకారం చెరువు ఉప్పరపాలెం గ్రామానికి చెందిన ముద్రబోయిన రమాదేవి (50), ఆమె కుమారుడు ముద్రబోయిన వెంకటేశ్వర్లు (32) ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందారు. కన్నతల్లి, కొడుకు ఇద్దరూ ఒకేసారి అనుకోని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం ఆ కుటుంబానికి తీరని లోటని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రగాఢ మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ప్రార్థించారు.

**బాధిత కుటుంబానికి ప్రభుత్వ భరోసా**

ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి అండదండలుంటాయని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ పరంగా అందవలసిన ఎక్స్–గ్రేషియా (పరిహారం) త్వరితగతిన అందేలా బాపట్ల సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన భరోసానిచ్చారు.

అధికారులకు, ప్రజలకు గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన విద్యుత్ తీగలు మరియు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను తక్షణమే గుర్తించి, ఎలాంటి ప్రాణనష్టాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు విద్యుత్ పరికరాలు, వైర్ల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరారు. తడి చేతులతో స్విచ్‌లను ముట్టుకోవడం లాంటి ప్రమాదకర పనులకు దూరంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## అక్టోబర్ 1 మధ్యాహ్నం నుంచే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ

- **రూ.2,692.34 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం**
- **బ్యాంకుల సెలవులు, సమ్మె ఉన్నా పింఛనుదారులకు ఇబ్బంది కలగనివ్వం**
- **మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**అమరావతి, సెప్టెంబర్ 24(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో 61.80 లక్షల మంది పింఛనుదారులకు అక్టోబర్ 1న పింఛన్లు అందజేసేందుకు ప్రభుత్వం రూ. 2,692.34 కోట్లు విడుదల చేసిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

విడుదల చేసిన మొత్తం నిధుల్లో రూ. 2,675.63 కోట్లను సంబంధిత స్వర్ణ గ్రామం / స్వర్ణ వార్డు పింఛను బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని, రూ. 16.65 కోట్లను పింఛనుదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రత్యక్ష లబ్ధి బదిలీ ద్వారా నేరుగా జమ చేస్తారని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, ప్రత్యేక నికర ఖాతా వ్యవస్థ --సుపార్స్ విధానం ద్వారా ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లో నేరుగా ప్రత్యక్ష లబ్ధి బదిలీ ద్వారా పింఛన్లను జమ చేసే ప్రక్రియను విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలో పైలట్ ప్రాతిపదికన అమలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం ఈ మండలంలోని జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం పింఛనుదారుల ఖాతాల్లో రూ. 0.06 కోట్లు నేరుగా జమ కానున్నట్లు మంత్రి కొండపల్లి తెలిపారు.

సెప్టెంబర్ 26వ తేదీ శనివారం బ్యాంకు సెలవు కావడం, అలాగే సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె ఉన్న నేపథ్యంలో పింఛనుదారులకు ఎలాంటి అవస్థలు కలగకుండా ప్రభుత్వం ముందస్తుగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు మంత్రి తెలిపారు.

ఈ మేరకు అక్టోబర్ 1వ తేదీ ఉదయమే పింఛన్ల పంపిణీకి అవసరమైన నగదును ఉపసంహరించుకునేలా బ్యాంకులను అందుబాటులో ఉంచాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు.

స్వర్ణ గ్రామం / స్వర్ణ వార్డు సిబ్బంది అక్టోబర్ 1వ తేదీ ఉదయం బ్యాంకుల నుంచి నగదును ఉపసంహరించుకుని, అదే రోజు మధ్యాహ్నం నుంచే నేరుగా పింఛనుదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని మంత్రి కొండపల్లి స్పష్టం చేశారు.

బ్యాంకు సెలవులు, సమ్మె కారణాల వల్ల పింఛన్ల పంపిణీ తేదీ, విధానంలో జరిగిన ఈ మార్పులను పింఛనుదారులందరూ గమనించి, పంపిణీ సిబ్బందికి మరియు ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు.

# ఖైరతాబాద్ గణనాథుడిని దర్శించుకున్న డీజీపీ సీ.వీ.ఆనంద్

- ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనాలు జరగాలి : డీజీపీ
- నిమజ్జనాల కోసం భారీ బందోబస్తు.. సమన్వయంతో ఏర్పాట్లు
- డీజేలు, బాణసంచాకు దూరంగా ఉండాలని ఉత్సవ కమిటీలకు సూచన



**హైదరాబాద్, సెప్టెంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు డిజిపి సి.వి. తెలిపారు. గురువారం ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్న ఆయన.. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గణనాథుడి ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు.

**13 ఏళ్లుగా ఖైరతాబాద్‌తో అనుబంధం :**

సెంట్రల్ జోన్ డీసీపీగా పనిచేసినప్పటి నుంచి ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలతో తనకు 13 ఏళ్ల అనుబంధం ఉందని డిజిపి గుర్తుచేశారు. సుదర్శన్ గారు , ఇప్పుడు వారి కొడుకులు సందీప్ మరియు రాజ్కుమార్ కూతురు వీణా, మహేష్ యాదవ్ ఇతర సభ్యులు వారందరూ శాంతియుతంగా నిమజ్జనాలు చెయ్యడానికి చాలా సహకరిస్తారని తెలియచేసారు.ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**30 వేల మంది పోలీసులతో బందోబస్తు :**

పది రోజుల గణేష్ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయని డీజీపీ తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నిమజ్జనాలు జరుగుతున్నాయని, రేపు, ఎల్లుండి భారీ సంఖ్యలో నిమజ్జనాలు జరిగే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ సీపీలు, ఎస్పీలు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో సుమారు 30 వేల మంది పోలీసులను బందోబస్తు కోసం మోహరించినట్లు వెల్లడించారు.

**అన్ని శాఖల సమన్వయంతో :** నిమజ్జనాల కోసం జీహెచ్ఎంసీ, విద్యుత్, జలవనరులు, ఇతర ప్రభుత్వ శాఖలతో పోలీసుశాఖ సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. హుస్సేన్‌సాగర్‌తో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లు పూర్తిచేశామని చెప్పారు. ట్యాంక్‌బండ్‌పై అవసరమైన చోట్ల క్రేన్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

**మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు :**

నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో చోరీలు, మహిళల పట్ల వేధింపులు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు డిజిపి తెలిపారు. షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించామని, ట్రాఫిక్, లాఅండ్‌ఆర్డర్ విభాగాలు పనిచేస్తున్నాయని చెప్పారు.

**డీజేలు, బాణసంచా వద్దు :**

నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలు, బాణసంచా వినియోగంపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అమల్లో ఉన్నాయని డిజిపి గుర్తుచేశారు. అధిక శబ్దాలతో ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి డీజేలు, బాణసంచాకు దూరంగా ఉండాలని నిర్ణయించుకోవడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని డిజిపి సూచించారు.

# భారీ వర్షాలతో స్వల్పంగా దెబ్బతిన్న చార్మినార్..?

- లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ లో ఊడిపడిన ప్లాస్టరింగ్ పెచ్చులు..
- మరమ్మతుల కోసం ఇప్పటికే టెండర్ల ప్రక్రియలో ఉందని ఏఎస్ఐ వెల్లడి..
- శనివారం వరకు భారీ వర్ష సూచనతో అప్రమత్తమైన అధికారులు

**హైదరాబాద్, సెప్టెంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** భాగ్య నగరంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో చారిత్రక కట్టడం చార్మినార్ స్వల్పంగా దెబ్బతింది. మంగళవారం రాత్రి పాతబస్తీలో సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వానకు లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న చార్మినార్ భద్రతా సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, కిందపడిన ప్లాస్టరింగ్ శకలాలను తొలగించారు. మంగళవారం సాయంత్రం నగరంలో 37.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భారీ వర్షం కారణంగానే మినార్ ప్లాస్టరింగ్ ఊడిపడి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

ఈ ఘటనపై భారత పురావస్తు శాఖ అధికారులు స్పందించారు. ఎడమవైపు మినార్ కింద ఉన్న గోడ వెలుపలి భాగం కొంత



బలహీనపడటంతో భారీ వర్షానికి ప్లాస్టరింగ్ రాలిపోయిందని వారు తెలిపారు. దెబ్బతిన్న భాగానికి మరమ్మతులు నిర్వహించేందుకు ఇప్పటికే టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఇదిలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల్లో అత్యధికంగా సంగారెడ్డిలో 82.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మరోవైపు, ఈ నెల 26వ తేదీ శనివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో చార్మినార్‌తో పాటు ఇతర చారిత్రక కట్టడాల వద్ద అప్రమత్తంగా ఉండాలని అధికారులు నిర్ణయించారు.

# వినాయక నిమజ్జనానికి ఎంఎంసీ భారీ ఏర్పాట్లు

- 39 నిమజ్జన కేంద్రాలు..
- 84 క్రేన్లు సిద్ధం చేసిన అధికారులు
- 1,356 మంది పారిశుద్ధ్య సిబ్బందితో 24 గంటల సేవలు
- వైద్య, విద్యుత్, పారిశుద్ధ్య, రెస్క్యూ బృందాలు సిద్ధం

**హైదరాబాద్, సెప్టెంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** వినాయక చవితి నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా నిర్వహించేందుకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిమజ్జన కేంద్రాలు, ఊరేగింపు మార్గాలు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్యం, రక్షణ తదితర విభాగాలను సమన్వయం చేస్తూ చర్యలు చేపడుతున్నట్లు ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు.ఎంఎంసీ పరిధిలోని ఉప్పల్, మల్కాజిగిరి, ఎల్‌బీనగర్ మూడు జోన్లలో మొత్తం 39 నిమజ్జన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో 18 చెరువులు, 7 కుంటలు/బేబీ పాండ్లు, 15 కృత్రిమ చెరువులు లేదా పోర్టబుల్ ట్యాంకులు ఉన్నాయి. ఉప్పల్ జోన్‌లో 10, మల్కాజిగిరి జోన్‌లో 20, ఎల్‌బీనగర్ జోన్‌లో 9 కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు.

**84 క్రేన్లు.. రెస్క్యూ బృందాలు**

ప్రధాన చెరువులు, కుంటలు, కృత్రిమ నిమజ్జన కేంద్రాల వద్ద 84 స్టాటిక్, మొబైల్ క్రేన్లను ఏర్పాటు చేయనున్నారు. ఉప్పల్ జోన్‌లో 19, మల్కాజిగిరిలో 16, ఎల్‌బీనగర్‌లో 49 క్రేన్లు అందుబాటులో ఉంటాయి. ప్రధాన కేంద్రాల్లో డీఆర్ఎఫ్ బృందాల ఆధ్వర్యంలో ఈతగాళ్లు, పడవలు, లైఫ్ సేవింగ్ పరికరాలను సిద్ధంగా ఉంచనున్నారు.

**1,356 మంది పారిశుద్ధ్య సిబ్బంది**

నిమజ్జనోత్సవాల సందర్భంగా ౹168 గణేష్ యాక్షన్ టీమ్స్ (GATs)ను ఏర్పాటు చేసి 13 సర్కిళ్ల పరిధిలోని 56 ఊరేగింపు మార్గాల్లో మోహరించనున్నారు. మూడు షిఫ్టుల్లో 1,356 మంది పారిశుద్ధ్య సిబ్బంది 24 గంటల పాటు విధులు నిర్వహించనున్నారు. మండపాల వద్ద చెత్త సంచులు ఏర్పాటు చేసి, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించనున్నారు. మినీ టిప్పర్లు, జేసీబీల ద్వారా చెత్తను తరలించనున్నారు.

**విద్యుత్.. రోడ్లు.. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి**

నిమజ్జన కేంద్రాలు, ఊరేగింపు మార్గాల్లో ఫోకస్ లైట్లు, తాత్కాలిక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు వేలాడుతున్న కేబుళ్లను తొలగించనున్నారు. వీధి దీపాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా పర్యవేక్షణ చేపట్టనున్నారు. ఊరేగింపు మార్గాల్లో చెట్ల కొమ్మల తొలగింపు, రోడ్ల మరమ్మతులు, గుంతల పూడ్చివేత, ఫుట్‌పాత్‌లకు రంగులు వేయడం వంటి పనులు చేపట్టనున్నారు.



నిమజ్జన కేంద్రాల వద్ద దోమల నివారణకు యాంటీ లార్వల్ ఆపరేషన్లు, ఫాగింగ్ నిర్వహించనున్నారు. అవసరమైన ప్రాంతాల్లో డాగ్ క్యాచింగ్ వాహనాలను కూడా అందుబాటులో ఉంచనున్నారు.

**62 మొబైల్ టాయిలెట్లు.. వైద్య శిబిరాలు**

ప్రజల సౌకర్యార్థం నిమజ్జన కేంద్రాల వద్ద 62 మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనున్నారు. ఉప్పల్‌లో 12, మల్కాజిగిరిలో 46, ఎల్‌బీనగర్‌లో 4 టాయిలెట్లు అందుబాటులో ఉంటాయి. ప్రధాన నిమజ్జన కేంద్రాల్లో మూడు షిఫ్టుల్లో వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచనున్నారు. నిమజ్జనోత్సవాలు ఎలాంటి అవాంతరాలు లేకుండా జరిగేలా అన్ని శాఖల అధికారులు,

సిబ్బంది సమన్వయంతో 24 గంటల పర్యవేక్షణ, సేవలు అందించేందుకు ఎంఎంసీ యంత్రాంగం సిద్ధమవుతోంది.

# గణేష్ నిమజ్జనానికి సెలవు..

- బాలల దినోత్సవం రోజు ప్రభుత్వ కార్యాలయాలకు పనిదినం
- సెప్టెంబర్ 25న సాధారణ సెలవురోజుగా ప్రకటించిన ప్రభుత్వం
- హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలకు వర్తింపు
- నిమజ్జన శోభాయాత్రల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
- నవంబర్ 14న రెండో శనివారం పనిదినంగా ప్రకటన

**హైదరాబాద్, సెప్టెంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నిమజ్జన శోభాయాత్రలు, భారీగా తరలివచ్చే భక్తులు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లను దృష్టిలో ఉంచుకుని రేపు అనగా సెప్టెంబర్ 25వ తేదీ శుక్రవారం సాధారణ సెలవుగా ప్రకటించింది. హైదరాబాద్-సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో ఈ సెలవు అమల్లోకి రానుంది.ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. సెలవు పరిధిలోకి వచ్చే ప్రభుత్వ కార్యాలయాలు, పరిపాలనా విభాగాలు, పాఠశాలలు, కళాశాలలకు ఈ నిర్ణయం వర్తించనుంది. నిమజ్జన శోభాయాత్రల సందర్భంగా నగరంలోని ప్రధాన మార్గాల్లో భారీగా ట్రాఫిక్ ఏర్పడే అవకాశం ఉండటంతోపాటు, ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టేందుకు ఈ సెలవు ప్రకటించినట్లు ప్రభుత్వం పేర్కొంది.

**నిమజ్జన వేడుకలకు భారీ ఏర్పాట్లు :**


హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రతి ఏడాది భారీగా శోభాయాత్రలు నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి గణేష్ విగ్రహాలు ఊరేగింపుగా తరలివచ్చి నిమజ్జనం చేస్తారు.

దీంతో ప్రధాన రహదారులు, నిమజ్జన ప్రాంతాల్లో భారీగా ప్రజలు, వాహనాలు చేరే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.



**నవంబర్ 14న పనిదినం :** సెప్టెంబర్ 25న ప్రకటించిన సాధారణ సెలవుకు పరిహారంగా నవంబర్ 14వ తేదీని పనిదినంగా ప్రభుత్వం నిర్ణయించింది. సాధారణంగా రెండో శనివారం సెలవు ఉండే నేపథ్యంలో, ఆ రోజును పూర్తిస్థాయి పనిదినంగా పరిగణించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. నవంబర్ 14న సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలు, నిర్ణయ పరిధిలోని సంస్థలు యథావిధిగా పనిచేయనున్నాయి. సెలవు, పనిదినంలో చేసిన మార్పులను ఉద్యోగులు, విద్యార్థులు, సంబంధిత అధికారులు ముందుగానే గమనించాలని ప్రభుత్వం సూచించింది.అంటే.. వినాయక నిమజ్జనానికి సెప్టెంబర్ 25న సెలవు.. ఆ సెలవుకు పరిహారంగా నవంబర్ 14న రెండో శనివారం పనిదినం కానుంది..

# చర్లపల్లి జైలులో న్యాయ అవగాహన కార్యక్రమం..



- ఆర్థిక స్థోమత లేకున్నా న్యాయం దూరం కాదు..
- ఉచిత న్యాయ సేవలపై అవగాహన..

**హైదరాబాద్, సెప్టెంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్థిక ఇబ్బందులతో న్యాయ సహాయం పొందలేని పేదలు, బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సేవలపై అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డి ఎల్ ఎస్ ఏ ), మేడ్చల్ - మల్కాజిగిరి ఆధ్వర్యంలో సోమవారం చర్లపల్లి సెంట్రల్ జైలులో లీగల్ హెల్ప్ డెస్క్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో అడ్వకేట్ రవి రాజ్ రాథోడ్ కీలక పాత్ర పోషిస్తూ పాల్గొన్నారు.జైలు వద్ద ములాఖత్ కోసం వచ్చిన కుటుంబ సభ్యులకు రవి రాజ్ రాథోడ్ న్యాయపరమైన హక్కులు, ఉచిత న్యాయ సహాయం పొందే విధానం, బెయిల్, అప్పీల్ వంటి అంశాలపై సవివరంగా అవగాహన కల్పించారు.

ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయ సేవలు ఉచితంగా అందుబాటులో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు."డబ్బు లేకపోవడం వల్ల ఎవరికీ న్యాయం దూరం కాకూడదు" అనే లక్ష్యంతో ప్రజల్లో న్యాయ హక్కులపై అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని రవి రాజ్ రాథోడ్ అభిప్రాయపడ్డారు. ప్రజలకు న్యాయంపై అవగాహన కల్పించడం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు న్యాయ సహాయం అందేలా చూడటం తన బాధ్యతగా భావిస్తూ, ఆయన నిరంతరం ప్రజా సమస్యలపై కృషి చేస్తున్నారని కార్యక్రమంలో పాల్గొన్నవారు పేర్కొన్నారు.

ప్రజల సమస్యలను తెలుసుకుని, వారి హక్కుల సాధన కోసం సరైన న్యాయపరమైన మార్గాలను తెలియజేయడంలో రవి రాజ్ రాథోడ్ చేస్తున్న కృషి ఇలాగే కొనసాగుతుందని

కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆకాంక్షించారు.

## సర్-2026 ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష.



**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)--2026 ప్రక్రియను నిర్ణీత గడువులోగా పారదర్శకంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ అధికారులను ఆదేశించారు.బుధవారం జడ్చర్ల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ERO),రెవెన్యూ అదనపు కలెక్టర్ జె ఎల్ బి హరిప్రియ జడ్చర్ల తహశీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్--2026 ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల పంపిణీ, విచారణల పురోగతిని సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు 93.59 శాతం నోటీసుల పంపిణీ, 45.33 శాతం విచారణలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన విచారణలను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

అదేవిధంగా ఏఈఆర్ఓ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న ఫారం-6 (కొత్త ఓటరు నమోదు), ఫారం--7 (ఓటరు తొలగింపు), ఫారం-8 (ఓటరు వివరాల సవరణ) దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.ఎస్ఐఆర్--2026 ప్రక్రియకు సంబంధించి ఏవైనా సమస్యలు లేదా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించి, విచారణలకు వారు హాజరయ్యేలా సహకరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా పూర్తయ్యేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జడ్చర్ల తహసీల్దార్/ఏఈఆర్ఓ నర్సింగ రావు, అదనపు తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్ (ఎం), ఎన్నికల డీటీ తదితర అధికారులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మీ - షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**నర్సంపేట, సెప్టెంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** నర్సంపేట నియోజకవర్గంలోని నర్సంపేట పట్టణం , నర్సంపేట మండలం, దుగ్గొండి , నల్లబెల్లి , ఖానాపూర్ మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు నర్సంపేట ఎమ్మెల్యే శ్రీ దొంతి మాధవరెడ్డి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మొత్తం 146 మంది లబ్ధిదారులకు 1 కోటి 46 లక్షల రూపాయల విలువైన చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఉమారాణి,మునిసిపల్ చైర్పర్సన్ పెండెం శ్రీ లక్ష్మి రామనంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మెన్లు బొబ్బల రమణా రెడ్డి , తోకల శ్రీనివాస్ రెడ్డి, చెన్నూరు కిరణ్ రెడ్డి, కంకల ప్రసాద్ , రఘుపతి రావు , వల్లే శ్రీనివాస్ , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హరిబాబు , మునిసిపల్ వైస్ చైర్మన్ నరేందర్ , కౌన్సిలర్లు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కూడళ్లు, సర్కిళ్లను పరిశీలించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.మధుసూదన్ నాయక్



**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కూడళ్లు, సర్కిళ్ల లో ఏర్పాటు చేసిన కళాకృతులు, ఫౌంటెన్లు, ఆకర్షణీయ బొమ్మల నిర్వహణ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్కిళ్లలో నెలకొన్న సమస్యలు, నిర్వహణ పరిస్థితులను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

మున్సిపల్ కమిషనర్ తక్షణమే చర్యలు చేపట్టి 24 గంటల్లో అవసరమైన మరమ్మతులను పూర్తి చేయాలని ఆదేశించారు. సర్కిళ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా, సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ పరిధిలోని అన్ని సర్కిళ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు.

## ప్రజల డిజిటల్ చెల్లింపులకు రుసుముల భారం మోపొద్దు

- యూపీఐ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలి..
- యాదగిరిగుట్టలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ..




**యాదగిరిగుట్ట, సెప్టెంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నామని చెబుతూనే యూపీఐ లావాదేవీలపై రుసుముల భారం మోపడం సరికాదని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) డిమాండ్ చేసింది. ప్రజలు, విద్యార్థులు, యువత, కార్మికులు, చిన్న వ్యాపారులు నిత్య జీవితంలో విస్తృతంగా వినియోగిస్తున్న యూపీఐ చెల్లింపులపై కొత్తగా వ్యాపారి రుసుములు విధించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ బుధవారం యాదగిరిగుట్టలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ.. దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ ప్రజలకు సౌకర్యంగా, అందుబాటులో ఉండేలా కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. యూపీఐపై అదనపు రుసుముల విధానం చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న యువతపై భవిష్యత్తులో ఎలాంటి ఆర్థిక ప్రభావం చూపుతుందనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధానం ప్రకారం రూ. 2,000కు మించిన వ్యక్తి -- వ్యాపారి లావాదేవీలపై 0.4 శాతం వ్యాపారి రుసుము, రూ. 75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలపై ఒక్కో లావాదేవీకి గరిష్ఠంగా రూ. 300 వరకు రుసుము వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. వ్యక్తి -- వ్యక్తి లావాదేవీలు, రూ. 2,000 వరకు వ్యాపారి లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, కొత్త రుసుముల విధానంపై పూర్తి పారదర్శకత అవసరమన్నారు. ప్రభుత్వం చెబుతున్న గణాంకాల ప్రకారం మొత్తం వ్యాపారి లావాదేవీల్లో సుమారు 96 శాతం ఈ విధానం వల్ల ప్రభావితం కావని పేర్కొంటున్నప్పటికీ, మిగిలిన లావాదేవీలపై రుసుము విధించే విధానాన్ని కూడా ప్రజా ప్రయోజనాల కోణంలో సమీక్షించాలని మహేందర్ కోరారు. "ప్రజల డిజిటల్ చెల్లింపులు.. ప్రజల ప్రయోజనాల కోసమే ఉండాలి.. రుసుముల భారానికి కాదు" అనే నినాదంతో పారదర్శకమైన, అందరికీ అందుబాటులో ఉండే డిజిటల్ చెల్లింపు వ్యవస్థ కోసం ప్రజా చర్చను ముందుకు తీసుకెళ్లాలని ఏఐవైఎఫ్ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి, కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, సహాయ కార్యదర్శి పేరబోయిన బంగారు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, అనంతుల నర్సింహ, శెట్టి నర్సింహ, సంగి అరవింద్, బండ రామచందర్, ఒంటెద్దు సంజీవ, పేరబోయిన సత్యనారాయణ, ప్రశాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# సహకార బ్యాంకు ద్వారా రైతులకు రుణ సదుపాయం: పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల



**పాల్వంచ, సెప్టెంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :**

పాల్వంచ మండలంలోని రైతులకు కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) ద్వారా రుణ సదుపాయం కల్పించనున్నారని పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సొసైటీ కార్యాలయంలో పాలక వర్గం సభ్యులు, సహకార బ్యాంక్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ డీసీసీబీ ద్వారా రైతులకు దీర్ఘకాలిక రుణాలు (ఎల్.టి. లోన్స్) ఎకరానికి 5.00 లక్షల వరకు 10.5 శాతం వడ్డీపై ఇవ్వనున్నారని అన్నారు. దీర్ఘకాలిక రుణాలలో ట్రాక్టర్లు, గేదెలు, మేకలు, గొర్రెలు వంటి వాటికి ఇవ్వనున్నారన్నారు. మండలంలోని (రూరల్) రైతులకు 30.00 లక్షల రూపాయలు వరకు, గృహ నిర్మాణాలకు 11.00 శాతం వడ్డీపై రుణాలు ఇవ్వనున్నారని అన్నారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్వాల అన్నారు.ఈ సమావేశంలో డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ ఎ. స్వప్న, సూపర్వైజర్ ఎస్. పూర్ణచందర్ రావు, ఎఫ్.ఎల్.సి వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్లు బుడిగం రామమోహన్ రావు, కనగాల నారాయణరావు, జరబన సీతారాంబాబు, చౌగాని పాపారావు, సొసైటీ సి.ఇ.ఓ. జి. లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారుపేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు, రాజ్యాంగ నిబంధనలకు అత్యున్నత ప్రాధాన్యత ఉంటుందని, పార్టీ ఫిరాయింపుల విషయంలో ప్రజలే తగిన సమయంలో తమ తీర్పును వెల్లడిస్తారని డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు.

# ఏదులాపురం మున్సిపాలిటీ సమస్యలపై కమిషనర్ కి ఉద్యోగ సంఘాల వినతి



**ఖమ్మం, సెప్టెంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి కి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేయగా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన పిదప ఈ క్రింద తెలిపిన వాటిపై హామీ ఇవ్వడం జరిగింది. ప్రణాళికాబద్ధంగా రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస రెడ్డి సహకారంతో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దామని తెలిపారు. పారిశుధ్య పనులు రోజు విడిచి రోజు చేయిస్తానని, కుక్కల బెడదను నివారించుటకు కాంట్రాక్టర్ కు అప్పగిస్తున్నామని, పందులను కూడా విహరించకుండా చూస్తామని తెలిపారు. గతంలో ఉన్న మిషన్ భగీరథ పైపులను మరమ్మత్తు చేయించి పైపులు ఉన్నచోట నీటిని అందించుటకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎదులాపురం చెరువును నింపి మంచినీళ్లు అందిస్తున్నామని తెలిపారు. రైతు బజార్ కి త్వరలో నిర్మాణం చేపడతామన్నారు. 9 చోట్ల పార్కులను, ఓపెన్ జిమ్ములను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్ క్రాస్ రోడ్ నుండి కోదాడ క్రాస్ రోడ్ వరకు డివైడర్ ను ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ కొరకు టెండర్లు వేయడం పూర్తి అయిందని తెలిపారు. సీసీ రోడ్లు డ్రైనేజీలకు సంబంధించి పాత కాంట్రాక్టర్లను తొలగించి కొత్తగా టెండర్లను ఆహ్వానించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేయటం జరిగింది. దసరా సెలవులలో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. లైబ్రరీని రోటరీ నగర్ నుంచి ఏదులాపురం నకు షిఫ్ట్ చేస్తున్నట్లు తెలిపారు. హామీ ఇచ్చిన కమిషనర్ కి ఉద్యోగ సంఘం నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు విజయ్, ఎర్రమళ్ళ శ్రీనివాసరావు, ఉడుగు వెంకటేశ్వరరావు, శోభన్ బాబు, రాములు నాయక్, మల్లయ్య, సాయిబాబా ,దేవయ్య, పుల్లయ్య, వెంగళరావు, వీరన్న, లచ్చు నాయక్, లింగయ్య, కేశయ నాయక్, పి. వెంకటేశ్వరరావు, వెంకటరమణ, వెంకటరెడ్డి, వెంకట్ రాములు, మల్లికార్జున్, అమ్మ, రమేష్, శ్రీనివాస్, ఉస్మాన్ అలీ, రామ్మూర్తి, శివరావు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి నాటికి నిర్మాణ పనులన్నీ పూర్తి కావాలి : రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- భద్రాచల దేవస్థానంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు, ప్రాకారాల నిర్మాణాల పరిశీలన
- సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతా ధికారులతో సమీక్ష





**ఖమ్మం, సెప్టెంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :**

వచ్చే ఏడాది శ్రీరామనవమి నాటికి భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన ప్రాకారాలు, మాడ వీధుల పున:నిర్మాణ పనులు పూర్తి కావాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం మహబాద్ ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న లతో కలిసి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద ఆశీర్వచనాలతో తీర్థప్రసాదాలు అందజేశారు. --- వర్షం కురుస్తున్నా పనుల పరిశీలన బుధవారం ఉదయం నుంచి భద్రాచలం పరిసర ప్రాంతాల్లో వర్షం కురుస్తున్నప్పటికీ ముందస్తు షెడ్యూల్ ప్రకారం మంత్రి పొంగులేటి దేవాలయం చేరుకున్నారు. దమ్మక్క అన్నదాన సత్రం నుంచి మెట్లదారి వరకు వర్షపు చినుకులు కురుస్తున్నా, బురదలోనే దేవస్థానం చుట్టూ కలియతిరిగి నేరుగా పనులను పరిశలించారు. ఎట్టి పరిస్థితులోనూ జాప్యం నెలకొనొద్దని సూచనలు చేశారు. ఆ తర్వాత భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు.--- వంద శాతం పనులు పూర్తి చేయిస్తాం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూ.300 కోట్ల నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈనెల 4వ తేదీన పరిశీలించానని, మళ్లీ ఇప్పటివరకు జరిగిన పురోగతిని నేరుగా తెలుసుకునేందుకు వచ్చినట్లు వెల్లడించారు. అధికారులు కూడా నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఆగమ శాస్త్ర నిబంధనల ప్రకారం పునఃనిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందేలా సకాలంలో పూర్తి చేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం

- ఉచిత ఆయుర్వేద మెగా వైద్య శిబిరం విజయవంతం : ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు





**ఖమ్మం, సెప్టెంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :**

11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రభుత్వ ఆయుర్వేద, హోమియో, యునాని వైద్యశాలల ఆధ్వర్యంలో ఉచిత "ఆయుర్వేద మెగా వైద్య శిబిరం" విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు బి.పి, షుగర్, కీళ్ల నొప్పులు, వాత రోగాలు తదితర ఆరోగ్య సమస్యలకు సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరానికి దాదాపు 436 మంది రోగులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు మాట్లాడుతూ ప్రజలు ఆయుర్వేద వైద్యంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మారుతున్న జీవనశైలికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ 'యోగా'ను దైనందిన జీవితంలో ఒక ముఖ్య భాగం చేసుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యులు డాక్టర్ కె. పద్మావతి (సీనియర్ మెడికల్ ఆఫీసర్ అండ్ నోడల్ ఆఫీసర్), డాక్టర్ వై. ఉపేందర్ (సీనియర్ మెడికల్ ఆఫీసర్ అండ్ డిప్యూటీ నోడల్ ఆఫీసర్), డాక్టర్ బి. సుధాకర్ (మెడికల్ ఆఫీసర్ అండ్ డిప్యూటీ నోడల్ ఆఫీసర్), డి.పి.ఎం. బాబూనాయక్ లతో పాటు ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది, యోగా ఇన్స్ట్రక్టర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మాజీ కౌన్సిలర్ జోగుపర్తి ప్రభాకర్ రావు కూడా పాల్గొని తమ సందేశాన్ని అందించారు. జోగుపర్తి వైద్య శిబిరం విజయవంతానికి ఎంతో సహకరించారని డాక్టర్ రామారావు వివరించారు.

# జిల్లా కమిటీని పక్కనపెట్టి ఏకపక్ష నిర్ణయాలా?అంతర్గత విభేదాలు, గ్రూపు రాజకీయాలపై భగ్గుమన్న పిడిఎస్ యు జిల్లా నాయకత్వం



**ఖమ్మం, సెప్టెంబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :**

మాస్‌లైన్ పార్టీకి అనుబంధంగా పనిచేస్తున్న పిడిఎస్ యు ఖమ్మం జిల్లా కమిటీలోని 23 మంది నాయకులు తమ బాధ్యతలకు, సిపిఐ(ఎం ఎల్) మాస్‌లైన్ పార్టీ సభ్యత్వానికి సామూహికంగా రాజీనామా చేసినట్లు ప్రకటించారు. పిడిఎస్ యు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్ తో పాటు జిల్లా, నగర, డివిజన్ స్థాయిల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులు బుధవారం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు.పిడిఎస్ యు నాయకత్వంలో సరైన మార్గదర్శకత్వం, సమన్వయం లేకపోవడంతో పాటు కార్యకర్తల పట్ల అప్రజాస్వామిక వైఖరి కొనసాగుతోందని వారు ఆరోపించారు. సంస్థాగత నిర్ణయాల్లో జిల్లా కమిటీ సభ్యుల అభిప్రాయాలు, కార్యకర్తల భిన్నాభిప్రాయాలు, సమగ్ర చర్చలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని పేర్కొన్నారు.ప్రస్తుతం సంస్థాగత అభివృద్ధి, ఉద్యమ విస్తరణ కంటే వ్యక్తిగత ధోరణులు, గ్రూపు రాజకీయాలు, అంతర్గత విభేదాలకు ప్రాధాన్యత పెరిగిందని వారు ఆరోపించారు. పీడిఎస్ యు ఖమ్మం జిల్లా కమిటీ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా పై కమిటీ స్థాయి నిర్ణయాలను "మెజారిటీ నిర్ణయం" పేరుతో అమలు చేయడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు.విమర్శ, ఆత్మవిమర్శ, సామూహిక చర్చ, భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణ, కింది స్థాయి కమిటీల అభిప్రాయాలకు ప్రాధాన్యత వంటి ప్రజాస్వామ్య సంస్థాగత పద్ధతులకు తగిన స్థానం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ వంగూరి పట్ల జరిగిన సంస్థాగత వ్యవహారాలను వారు ఖండించారు. ఒక కార్యకర్తకు సంబంధించిన అంశాలను సమిష్టిగా చర్చించి పరిష్కరించాల్సిన సందర్భంలో వ్యక్తిగత ధోరణులు, గ్రూపు రాజకీయాలు, అంతర్గత విభేదాలకు ప్రాధాన్యత ఇవ్వడం సరైన సంస్థాగత పద్ధతి కాదని పేర్కొన్నారు. జార్జిరెడ్డి, జంపాల ప్రసాద్ వంటి ఉద్యమ నాయకుల స్ఫూర్తితో ప్రగతిశీల, అభ్యుదయ భావజాలంతో విద్యార్థి సమస్యలపై పనిచేస్తున్న తమను సంస్థలో అణచివేసే పరిస్థితులు ఏర్పడ్డాయని వారు ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొనసాగడం సాధ్యం కాదని, ఇకపై ప్రగతిశీల, అభ్యుదయ భావజాల విస్తరణ కోసం స్వతంత్రంగా ముందుకు సాగుతామని తెలిపారు.రాజీనామా చేసిన వారిలో పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్, సహాయ కార్యదర్శులు సాదిక్ పాషా, యశ్వంత్, ఉపాధ్యక్షులు శశికిరణ్, వినయ్, జిల్లా కమిటీ సభ్యులు శిలార్ పాషా, హరిచంద్ర ప్రసాద్, సందీప్, సురేష్, నవీన్, అన్వేష్, కార్తీక్, వెంకటేష్, నిఖిల్, వెంకటేష్ వేల్పుల, విష్ణు, నిఖిల్, అశోక్, మహేష్, అశోక్, ఈశ్వర్, అసిఫ్ తదితరులు ఉన్నారు.తమ తదుపరి కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని వారు తెలిపారు.

## ఆర్ అండ్ ఆర్ సర్వే పూర్తి చేయాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్ అండ్ ఆర్ సర్వే శనివారం నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. సి.ఆర్.డి.ఏ భూ సమీకరణ, ఇతర పనుల పురోగతిపై కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ సర్వే పూర్తి చేసి ప్రచురణకు వెళ్లాలన్నారు. రికార్డు పరమైన ఆధారాలు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించాలని ఆదేశించారు. సబ్ డివిజన్ వచ్చే గురువారం నాటికి పూర్తి కావాలని ఆదేశించారు. అభ్యంతరాలు ఉంటే ఈ వారంలో పూర్తి చేయాలని అన్నారు. భూ సమీకరణలో ప్రతి వారం పురోగతి కనిపించాలని అన్నారు. ఈ సమావేశంలో సి. ఆర్. డి. ఏ అదనపు కమిషనర్ ఏ. భార్గవ్ తేజ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్. ఎస్. కె. ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాస రావు,తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీరమణి, సి. ఆర్. డి. ఏ డిప్యూటీ కలెక్టర్ లు, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలు.. వరద హెచ్చరికతో గుంటూరు పోలీసులు అప్రమత్తం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** భారీ వర్షాలు, తుఫాన్ ప్రభావం నేపథ్యంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులతో సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. 28 ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించాలని సూచించారు. వర్షాల కారణంగా రహదారులపై నీరు, గుంతలు, విరిగిపడే చెట్లతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సూచించారు. తాడికొండ మండలం లాం చప్టా వద్ద రహదారిపై పడిన చెట్లను పోలీసులు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి మిగులు నీటిని కృష్ణా నదిలోకి విడుదల చేసే అవకాశం ఉన్నందున తుళ్లూరు, తాడేపల్లి, సీతానగరం ఘాట్, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లోని కృష్ణా పరివాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కృష్ణా పరివాహక ప్రాంతాల్లో ఎస్‌హెచ్‌ఓలు నిరంతరం పర్యవేక్షించాలని, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరికలు ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. రహదారులు, చెట్లు లేదా ఇతర సమస్యలు ఏర్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలు

**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 'యూత్ ఫెస్ట్ 2026'లో భాగంగా గురువారం బాపట్ల జిల్లాలోని రేపల్లె, బాపట్ల మరియు చీరాల మండలాల్లో విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా 'రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలు' నిర్వహించారు. పాఠశాలలు మరియు ఇంటర్మీడియట్ (8, 9 మరియు 11వ తరగతి) చదివే విద్యార్థిని విద్యార్థులలో హెచ్ఐవీ పట్ల శాస్త్రీయ అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ మరియు ఎయిడెడ్ విద్యా సంస్థల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు టీబీ అధికారి డాక్టర్ సోమల నాయక్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మార్గదర్శకాల మేరకు ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించామన్నారు. గురువారం జరిగిన క్విజ్ పోటీల్లో అత్యధిక స్కోర్ సాధించిన టాప్-10 స్కూల్, కాలేజ్ టీమ్స్‌ను ఎంపిక చేశామని వీరికి శుక్రవారం నాడు జిల్లా స్థాయిలో మరోసారి పోటీలు ఉంటాయని తెలిపారు. శుక్రవారం జరిగే జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి నిలిచే టాప్-2 టీమ్స్‌ను రాష్ట్ర స్థాయిలో జరగబోయే పోటీలకు పంపిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ సాదిక్, దిశ సిబ్బంది, జిల్లాలోని వివిధ టి ఐ ఎన్ జి ఓ ప్రతినిధులు, పాఠశాల, కళాశాలల ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## 26న గడ్డిపాడు రైల్వే ఓవర్ బ్రిడ్జి శంకుస్థాపన విజయవంతం చేద్దాం

- భారీ బైక్ ర్యాలీలో అందరూ పాల్గొనాలి
- సన్నాహక సమావేశంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు నగరాభివృద్ధిలో మరో కలికి తురాయి వచ్చి చేరిందని, గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్ --గడ్డిపాడు రైల్వే లెవల్ క్రాసింగ్ (రాజ-3) పై రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించ బోతున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రైల్వే కేంద్ర సహాయ మంత్రి సోమన్న, కేందగర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. దీనికి సంబంధించిన సన్నాహక సభను గురువారం రాత్రి స్థానిక తూర్పు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గట్టిపాడు వద్ద భూమి పూజ అనంతరం ఇన్నర్ రింగ్ రోడ్ జంక్షన్ నుంచి భారీ బైక్ ర్యాలీ ప్రారంభమై వెంకటేశ్వర విజ్ఞాన్ మందిరం వరకు కొనసాగుతుందని చెప్పారు. గుంటూరు నగర అభివృద్ధికి ఎంతో కీలకమైన ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి శంకుస్థాపన కార్యక్రమాన్ని కూటమి శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆధ్వర్యంలో గుంటూరు నగరానికి మహర్దశ తీసుకొచ్చారని తెలిపారు. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం గుంటూరు నగరానికి మణికిరీటం అన్నారు. దీంతోపాటు తూర్పు నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. గుంటూరు నగరంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపడుతున్న కూటమి ప్రభుత్వం చేస్తోన్న మంచి గురించి ప్రజలకు తెలిసేలా నాయకులు, కార్యకర్తలు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.

## తుపాన్ ప్రభావంతో గుంటూరులో అప్రమత్తమైన నగరపాలక సంస్థ

- 3 వేల మంది ప్రజారోగ్య కార్మికులు విధుల్లో..
- 250 మంది అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** తుపాన్ ప్రభావంతో గుంటూరు నగరంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నగరపాలక సంస్థ యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజారోగ్య కార్మికులకు గురువారం సెలవు ఉన్నప్పటికీ సుమారు 3 వేల మంది సిబ్బందిని విధుల్లో కొనసాగించారు. మరో 250 మంది అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.

నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ గురువారం కంకరగుంట ఆర్‌యూబీ, 3 వంతెనలు, పట్టాభిపురం, స్తంభాలగరువు, విద్యానగర్ మెయిన్ రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-1, ఫేజ్-2, కాకాని రోడ్, బుడంపాడు ఎస్టీ కాలనీ, చుట్టగుంట సెంటర్, శాంతినగర్, ఏటీ అగ్రహారం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీటి పరిస్థితిని పరిశీలించడంతో పాటు పీకలవాగులోని అడ్డంకులను పరిశీలించి, వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు.

వర్షపు నీటిని సాధ్యమైనంత త్వరగా, 30 నిమిషాల్లోపు బెయిల్‌అవుట్ చేసేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. కంకరగుంట, 3 వంతెనల ప్రాంతాల్లో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి మోటార్ల ద్వారా నీటిని తొలగిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన డ్రైన్ల వద్ద మెష్‌లకు పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని ఆయిల్ ఇంజిన్ల ద్వారా తొలగించాలని సూచించారు.

ప్రధాన డ్రైన్లలో అడ్డంకులు ఉన్న ప్రాంతాల్లో జేసీబీలతో వ్యర్థాలను తొలగించి నీటి పారుదల సజావుగా జరిగేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఇందుకోసం 17 జేసీబీలు, 8 రోబోలు, 8 ఆయిల్ ఇంజిన్లు, 12 ట్రీ కటింగ్ మెషిన్లను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో గురువారం రాత్రి కూడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇళ్ల వివరాలను వెంటనే నివేదించాలని సూచించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్. విజయమ్మ సూచించారు. వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండటం, కలుషిత నీటి వినియోగం, దోమల వృద్ధి, సీజనల్ వ్యాధులు మరియు అంటువ్యాధుల వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటిని తప్పనిసరిగా కాచి చల్లార్చి లేదా శుద్ధి చేసి మాత్రమే వినియోగించాలన్నారు. వరద నీరు కలిసిన బావులు, పైపులైన్లు లేదా ఇతర నీటి వనరుల నీటిని ఉపయోగించకూడదని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల వృద్ధిని నివారించేందుకు నీటి నిల్వలను తొలగించి, అవసరమైన చోట దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పాత లేదా కలుషితమైన ఆహారాన్ని తీసుకోకూడదన్నారు . విరేచనాలు, వాంతులు, జ్వరం, జలుబు, దగ్గు, చర్మ సంబంధిత సమస్యలు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే స్వయంగా మందులు వేసుకోకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు .నీటిలో ఎక్కువ సేపు నడవడం వల్ల పాదాలకు గాయాలు లేదా ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉన్నందున వీలైనంత వరకు జాగ్రత్తలు పాటించాలన్నారు.

**ఆరోగ్య శాఖ సిబ్బందికి ప్రత్యేక సూచనలు**

భారీ వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి ఆదేశించారు. అన్ని పీహెచ్ సి లు, యూపీహెచ్ సి లు, సబ్ సెంటర్లు మరియు ఇతర ఆరోగ్య సంస్థల్లో అవసరమైన మందులు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, ఐ వి ఫ్లూయిడ్స్ , క్లోరిన్ మాత్రలు మరియు అత్యవసర వైద్య సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో జ్వరం, విరేచనాలు, వాంతులు, శ్వాసకోశ సమస్యలు మరియు ఇతర అంటువ్యాధుల కేసులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు మరియు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు . అనుమానాస్పద క్లస్టర్లు లేదా అసాధారణంగా కేసులు పెరిగిన ప్రాంతాలను వెంటనే గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని అన్నారు. ఎ ఎన్ ఎం లు, ఆశా కార్యకర్తలు మరియు ఇతర ఫీల్డ్ సిబ్బంది ద్వారా ఇంటింటి ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తాగునీటి వనరుల శుద్ధి, క్లోరినేషన్ మరియు పారిశుద్ధ్య చర్యలను సంబంధిత శాఖల సమన్వయంతో పర్యవేక్షించాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను సమీపంలోని ఉన్నత వైద్య కేంద్రాలకు సకాలంలో రిఫర్ చేయాలన్నారు. అన్ని ఆరోగ్య సిబ్బంది తమ విధులకు అందుబాటులో ఉండి, విపత్తు పరిస్థితుల్లో సమన్వయంతో పనిచేయాలన్నారు .

జిల్లా ప్రజల ఆరోగ్యం మరియు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, భారీ వర్షాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఆరోగ్య శాఖ సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న గల్లా మాధవి, టీడీ జనార్ధన్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గల్లా మాధవి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు టీడీ జనార్ధన్‌తో కలిసి గురువారం పలు మర్యాదపూర్వక, పరామర్శ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ముందుగా గల్లా మాధవి నివాసానికి వచ్చిన టీడీ జనార్ధన్‌కు గల్లా మాధవి, గల్లా రామచంద్రరావు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం ఎస్వీఎన్ కాలనీలో ఇటీవల మృతి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పావులూరి శివరామ కృష్ణయ్య కుమారుడు, ప్రముఖ కాటన్ వ్యాపారవేత్త పావులూరి కృష్ణకుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## గర్భిణీ స్త్రీలు,చిన్నారులు అప్రమత్తంగాఉండాలి: డాక్టర్ సుశాన్ గ్రేస్



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గర్భిణీ స్త్రీలు,చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని నందులపేట పట్టణప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ నక్కాసుశాన్ గ్రేస్ అన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ సుశాన్ గ్రేస్ మాట్లాడుతూ నీటి కాలుష్యం వలన డయేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. చిన్నారులకు డయేరియా నివారణకు కాచి చల్లార్చిననీటిని త్రాగించాలని, వేడి, వేడి ఆహార పదార్థాలను మాత్రమే భుజించాలని, ఎవరికైనా అనుమానం ఉన్నట్లయితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ఉచితంగా చికిత్స పొందాలని ఆమె తెలియజేశారు. సబ్ యూనిట్ ఆఫీసర్ అందెబాలచంద్రమౌళి మాట్లాడుతూ నీటినిల్వలు లేకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కీటక జనిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. సమావేశంలో ఫార్మసిస్ట్ శిరీష,డిఇఓ హరికృష్ణ,ఏఎన్ఎం షేక్ జంషద్ బేగం, రాము తదితరులు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్ర స్వామి సేవలో ఎంపీపీ



- ప్రత్యేక పూజలు చేసిన ఎంపిపి వీరనారాయణరెడ్డి

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్) :** బ్రహ్మంగారిమఠం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చిలికాంపల్లి వీరనారాయణరెడ్డి గురువారం నాడు జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు అభిషేకాలు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు తనను నమ్మి 5 సంవత్సరాలు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులుగా అవకాశం యిచ్చినందుకు తనకు వీలున్నవరకు మండలాన్ని అభివృద్ధి చేశానని ఆయన తెలిపారు.

## పదవీ ముగిసిన జడ్పీటీసీ ఎంపీటీసీలకు ఘన సత్కారం



- ఘనంగా సత్కరించిన మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి

**మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్):** జడ్పీటీసీ ఎంపీటీసీల ఐదేళ్ల పదవీకాలం పూర్తయిన సందర్భంగా ఘనంగా మైదుకూరు మండలంలోని జెడ్పిటిసి, ఎంపిటిసిలకు గురువారం సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీకాలం పూర్తి చేసుకున్న ప్రజాప్రతినిధులను శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురాం రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బి మఠం వైసిపి మండల అధ్యక్షుడు మేకల రత్నకుమార్ యాదవ్ నాయకులు మన్యం శంకర్ రెడ్డి జోగయ్య వాకమళ్ళ అనంతరెడ్డి తిప్పన నాగార్జున కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణకు సమష్టి కృషి అవసరం

- గ్రామ, వార్డు స్థాయి నుంచి చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను బలోపేతం చేయాలి
- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ ఎ.వి.ఎస్.ఎస్.ఎన్. రాజు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** పిల్లలకు అవసరమైన అన్ని సదుపాయాలు, రక్షణ కల్పించడం ప్రతి శాఖ బాధ్యత అని బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమిషన్ ఛైర్‌పర్సన్ ఎ. వి. ఎస్. ఎస్. ఎన్. రాజు అన్నారు.

గురువారం జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, విద్య, ఆరోగ్యం తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిషన్ సభ్యులు కె. జి. వి. పద్మలత, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కమిషన్ ఛైర్మన్ మాట్లాడుతూ, జిల్లా పర్యటనలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లను పరిశీలించామని తెలిపారు. ప్రతి చిన్నారి హక్కులను పరిరక్షించడం, వారికి ఆరోగ్యం, విద్య, భద్రత, పోషణ వంటి సదుపాయాలు అందేలా చూడటం అందరి బాధ్యత అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిల్లల సంక్షేమం కోసం కేటాయిస్తున్న ప్రజాధనం సక్రమంగా వినియోగమై, దాని ప్రయోజనాలు పూర్తిగా పిల్లలకు చేరేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

**చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను బలోపేతం చేయాలి:** గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డు స్థాయిలో ఉన్న చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను మరింత చురుకుగా పనిచేసేలా చూడాలని ఛైర్‌పర్సన్ సూచించారు. సర్పంచ్ లేదా ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం, గ్రామ పోలీస్ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులతో కూడిన కమిటీలు తమ పరిధిలోని పిల్లల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీ నెలకు కనీసం ఒక్కసారి సమావేశం కావాలని, ప్రతి నెల పాఠశాలలను తనిఖీ చేసి డ్రాప్‌అవుట్ పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల స్థాయి కమిటీలు గ్రామ, వార్డు స్థాయి కమిటీల పనితీరును పర్యవేక్షించాలన్నారు.

**బాలకార్మిక వ్యవస్థ, బాల్యవివాహాల నిర్మూలనకు చర్యలు**

14 సంవత్సరాల లోపు పిల్లలు తప్పనిసరిగా పాఠశాలల్లోనే ఉండేలా చూడాలని, ఎలాంటి పనుల్లోనూ బాలలను వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను ప్రమాదకర పరిశ్రమల్లో పనిచేయకుండా నిరోధించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న బాల్యవివాహాలను గుర్తించి అడ్డుకోవాలని అధికారులను ఆదేశించారు.

**పోక్సో కేసులు, టీనేజ్ గర్భధారణలపై అప్రమత్తత:** సోషల్ మీడియా, మొబైల్ ఫోన్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పిల్లలపై ప్రతికూల ప్రభావం పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. పోక్సో కేసులు, టీనేజ్ గర్భధారణలను అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

**అంగన్‌వాడీల్లో పోషకాహారం, పాఠశాలల్లో మౌలిక వసతులు:** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని, కనీసం ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక టాయిలెట్ ఉండేలా చూడాలని సూచించారు. పాఠశాలల్లో ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేసి సురక్షితమైన తాగునీరు అందించాలని తెలిపారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలల్లో కేవలం గణితం, సైన్స్‌పై మాత్రమే కాకుండా భాషా సబ్జెక్టులకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.

**హాస్టళ్లలో భద్రతకు ప్రాధాన్యత:** సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు హాస్టళ్లను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన సందర్భాల్లో రాత్రి వేళల్లో హాస్టళ్లలో బస చేసి పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. ప్రతి హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలు, సూచనలు తెలియజేసేందుకు తప్పనిసరిగా సలహాలు/ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**చిన్నారులను మాదకద్రవ్యాల సరఫరాకు వినియోగించకుండా చర్యలు:** గంజాయి వంటి మాదకద్రవ్యాల సరఫరాకు కొంతమంది చిన్నారులను ఉపయోగిస్తున్న ఘటనలు తమ దృష్టికి వచ్చాయని చైర్మన్ తెలిపారు. తమకు తెలియకుండానే చిన్నారులు నేరస్థులుగా మారే పరిస్థితులను అరికట్టేందుకు పోలీస్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

2047 నాటికి దేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్య సాధనలో నేటి పిల్లలే భవిష్యత్ భారత పౌరులని పేర్కొంటూ, వారిని ఆరోగ్యవంతులుగా, విద్యావంతులుగా, నైతిక విలువలు కలిగిన పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ మాట్లాడుతూ ఐసీడీఎస్ శాఖ పనితీరు గత ఆరు నెలల్లో గణనీయంగా మెరుగుపడిందని, అయితే ఇంకా కొన్ని లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లలో పారిశుద్ధ్యం, ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా గుడ్ల నాణ్యత విషయంలో రాజీ పడరాదన్నారు. అలాగే మాదకద్రవ్యాల నియంత్రణలో అవగాహన కార్యక్రమాల నిర్వహణతో పాటు విద్యార్థులను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని పోలీస్, ఇతర శాఖలకు సూచించారు. సంక్షేమ హాస్టళ్లను అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయడంతో పాటు, కనీసం నెలకు ఒకసారి రాత్రి వేళ హాస్టళ్లలో బస చేసి విద్యార్థులతో మాట్లాడాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా విద్యార్థులు స్వేచ్ఛగా తమ సమస్యలను తెలియజేసే అవకాశం ఉంటుందని, హాస్టళ్లలోని వాస్తవ పరిస్థితులను అధికారులు తెలుసుకోగలుగుతారని తెలిపారు. బాలల సంక్షేమానికి సంబంధించిన అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, కమిషన్ సూచించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని లోపాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. విజయలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ ప్రసూన, డీసీపీపీ విజయ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# మెగా డీఎస్సీ అభ్యర్థులపై దాడులు చేస్తే సహించం



- విద్యావ్యవస్థ బలోపేతానికి మంత్రి లోకేష్ విశేష కృషి
- ఈపూరుపాలెం జెడ్పీహెచ్ఎస్‌లో 'సేవ సర్వ అభియాన్' కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

**చీరాల రూరల్(జర్నలిస్ట్ ఫైల్)** :దేశాన్ని 2047 నాటికి 'వికసిత భారత్'గా అభివృద్ధి చెందిన దేశం తీర్చిదిద్దాలన్న ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్య సాధనలో విద్యావ్యవస్థదే కీలక పాత్ర అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఈపూరుపాలెంలోని జడ్పీహెచ్ బాలికల ప్రభుత్వ పాఠశాలలో బీజేపీ జిల్లా అధ్యక్షులు మువ్వల వెంకట రమణారావు ఆధ్వర్యంలో 'సేవ సర్వ అభియాన్' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో వారు కనబరిచిన ప్రతిభను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

గత వైస్సార్సీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆయన విమర్శించారు. రేషనలైజేషన్ పేరుతో స్కూళ్లను మూసివేసి, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. ఆ తప్పులను సరిదిద్దుతూ ప్రస్తుత ప్రభుత్వం 16 వేల పోస్టులతో 'మెగా డీఎస్సీ' ప్రకటించిందని గుర్తుచేశారు. అయితే, కొందరు ఉద్దేశపూర్వకంగా కోర్టుల్లో కేసులు వేస్తూ ఈ డీఎస్సీని అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. డీఎస్సీ అభ్యర్థులపై భౌతిక దాడులకు పాల్పడుతున్న రౌడీ మూకల చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. దాడులకు దిగితే ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మాధవ్ హెచ్చరించారు.

**మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో మారుతున్న బడులు**

రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అద్భుతంగా పనిచేస్తున్నారని మాధవ్ కొనియాడారు. ఆయన ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయన్నారు. స్మార్ట్ క్లాసులు, మధ్యాహ్న భోజన పథకం, యూనిఫాంలు, పుస్తకాల పంపిణీతో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ విద్యావ్యవస్థను బలోపేతం చేస్తున్నారని ప్రశంసించారు. నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం ఎన్ ఈ పి 2020 అమలుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తోందని హర్షం వ్యక్తం చేశారు.

**మోదీ నాయకత్వంలో ప్రపంచ స్థాయికి భారత్**

2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశంగా అవతరించాలన్న లక్ష్యం దిశగా విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకే పాఠశాలల్లో ఇలాంటి వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా భారత కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉండాలని, ఆయన సుదీర్ఘకాలం పాటు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటూ దేశాన్ని మరింత పురోగతి వైపు నడిపించాలని మాధవ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి యువ మోర్చా నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ఏపీ, తెలంగాణ బీజేపీ సంఘటన కార్యదర్శిగా ఎన్. మధుకర్



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు బీజేపీ సంఘటన కార్యదర్శిగా నియమితులైన ఎన్. మధుకర్‌ను పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు రాష్ట్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, రాష్ట్ర హెడ్‌క్వార్టర్స్ ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితర రాష్ట్ర, జిల్లా పదాధికారులు మధుకర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతల్లో ఎన్. మధుకర్ విజయవంతంగా రాణించాలని నాయకులు ఆకాంక్షించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడంతో పాటు బీజేపీ విస్తరణకు ఆయన నాయకత్వం దోహదపడుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి బీజేపీ నాయకులు, పదాధికారులు పాల్గొని ఎన్. మధుకర్‌కు అభినందనలు తెలిపారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉంచాలి




**మచిలీపట్నం(జర్నలిస్ట్ ఫైల్)** : ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని రకాల రక్త పరీక్షలు అందుబాటులో ఉండేలా చూడాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు కోరారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి ఎల్ దయాకర్ ను సురేష్ బాబు మర్యాదపూర్వకంగా కలసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కొన్నిచోట్ల పూర్తిస్థాయిలో రక్త పరీక్షలు అందుబాటులో లేకపోవడం వల్ల రోగులు ప్రైవేట్ ల్యాబ్ లలో వేలాది రూపాయలు ఖర్చుపెట్టి వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి వస్తుందన్నారు.

పి హెచ్‌సిలలో అన్ని రకాల మందులు కూడా రోగులకు అందుబాటులో ఉండేలా చూడాలని డిఎం అండ్ హెచ్ఓ ను సురేష్ బాబు కోరారు. కృష్ణా జిల్లా డిఎం అండ్ ఎం హెచ్ ఓ గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండీ ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శిస్తూ వైద్యులను, ఇతర సిబ్బందిని అప్రమత్తం చేస్తూ రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందేలా కృషి చేస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ దయాకర్‌ను సురేష్ బాబు అభినందించారు.

# ఇంద్రకీలాద్రి దసరా వేడుకలకు ఆరు రాష్ట్రాల సీఎంలకు ఆహ్వానం

- అసోం సీఎం హిమంత బిశ్వ శర్మను కలిసిన మంత్రి సత్యకుమార్ యాదవ్
- వెంట విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : విజయవాడ ఇంద్రకీలాద్రిపై అక్టోబరు 11 నుంచి 20 వరకు నిర్వహించనున్న దసరా మహోత్సవాలకు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించే కార్యక్రమాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. ఇందులో భాగంగా భాజపా జాతీయ నాయకుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం అసోం సీఎం హిమంత బిశ్వ శర్మను కలిశారు. దసరా మహోత్సవాలకు హాజరు కావాలని ఆయనను ఆహ్వానించారు. ఈ భేటీలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొన్నారు.

అంతకుముందు మంత్రి సత్యకుమార్ యాదవ్ గౌహతిలో అసోం ఆరోగ్యశాఖ మంత్రి అశోక్ సింఘాల్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం అసోం సీఎం హిమంత బిశ్వ శర్మతో భేటీ అయి దసరా మహోత్సవాలకు ఆహ్వానించారు.

**సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు** : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను దసరా మహోత్సవాలకు ఆహ్వానిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇంద్రకీలాద్రిపై పది రోజుల పాటు జరిగే శరన్నవరాత్రి వేడుకల ప్రత్యేకతను అసోం సీఎంకు వివరించారు. 2025లో దసరా వేడుకలకు 15 లక్షలకు పైగా భక్తులు ఇంద్రకీలాద్రిని సందర్శించిన విషయాన్ని తెలిపారు.

**ఆరు రాష్ట్రాల సీఎంలకు నేరుగా ఆహ్వానం** : అసోం సీఎం హిమంత బిశ్వ శర్మతో పాటు మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి, ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మలను కూడా దసరా మహోత్సవాలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆహ్వానించనున్నారు.

రానున్న రోజుల్లో ఆయా రాష్ట్రాలకు వెళ్లి ముఖ్యమంత్రులను స్వయంగా కలిసి వేడుకలకు నేరుగా ఆహ్వానిస్తారు.

**ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యం** : ఇంద్రకీలాద్రిపై జరిగే శరన్నవరాత్రి ఉత్సవాల్లో శ్రీ కనకదుర్గమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారని మంత్రి తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే ఈ వేడుకలకు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల రాకతో మరింత ప్రాధాన్యం చేకూరుతుందని పేర్కొన్నారు.

**భాజపా జాతీయ నేతగా కీలక బాధ్యతలు** : భాజపా జాతీయ నేతగా సత్యకుమార్ యాదవ్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. జాతీయ నాయకత్వం అప్పగించిన బాధ్యతల్లో భాగంగా వివిధ రాష్ట్రాల నాయకులతో సమన్వయం చేస్తున్నారు. పార్టీ కార్యక్రమాల కోసం ఇతర రాష్ట్రాల్లో పర్యటిస్తూ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతున్నారు. ఈ క్రమంలోనే దసరా మహోత్సవాలకు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను నేరుగా ఆహ్వానించే బాధ్యతను చేపట్టారు.

# అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి

- వేమూరు నియోజకవర్గంలో 83 మందికి రూ.40.66 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి



**వేమూరు(జర్నలిస్ట్ ఫైల్)** : వేమూరు నియోజకవర్గంలోని 45 గ్రామాలకు చెందిన 83 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.40,66,285 ఆర్థిక సహాయం మంజూరైంది. వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు.

చుండూరు మండలానికి చెందిన 12 మంది, అమృతలూరు మండలానికి చెందిన 13 మంది, వేమూరు మండలానికి చెందిన 21 మంది, కొల్లూరు మండలానికి చెందిన 13 మంది, భట్టిప్రోలు మండలానికి చెందిన 24 మంది ఈ సాయానికి అర్హత పొందారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితులు వైద్య ఖర్చుల బిల్లులను ఎమ్మెల్యే రిఫరెన్స్ లేఖ ద్వారా సీఎంఆర్ ఎఫ్ కార్యాలయానికి సమర్పించగా, అధికారులు పరిశీలించి అర్హులైన వారికి రీయింబర్స్‌మెంట్ మంజూరు చేశారు. ఈ సందర్భంగా నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి వైద్య ఖర్చుల విషయంలో ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు. నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

# జీజీహెచ్ అభివృద్ధి.. కలెక్టర్ స్పెషల్ ఫోకస్

- రూ.5.27 కోట్ల సీఎస్ఆర్ నిధులతో జీజీహెచ్‌లో కొత్త భవన నిర్మాణం
- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా జీజీహెచ్‌లో భవన నిర్మాణ ప్రణాళిక
- జీజీహెచ్ భవన నిర్మాణ డిజైన్లలో లోపాలు ఉండకూడదు
- ప్లాస్టిక్ సర్జరీ వార్డు పనులు నాణ్యతతో పూర్తి చేయాలి
- జీజీహెచ్‌లో పారిశుధ్యం నెల రోజుల్లో మెరుగుపడాలి
- జీజీహెచ్ అభివృద్ధి పనులపై కలెక్టర్ సాయికాంత్ వర్మ సమీక్ష



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** : ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో రూ. 5.27 కోట్ల సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న భవన నిర్మాణానికి సమగ్ర, నిర్మాణానికి అనుకూలమైన ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ ఆదేశించారు. గురువారం జీజీహెచ్‌లో భవన నిర్మాణ ప్రణాళికపై ఆయన సమీక్ష నిర్వహించారు.

నూతన భవనంలో ఆయా విభాగాల్లో ఉన్న పని ఒత్తిడిని అంచనా వేసి స్థల కేటాయింపులు చేయాలని సూచించారు. భవన నిర్మాణ డిజైన్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, ట్రామా కేర్ తదితర విభాగాల అధిపతులు తమ అవసరాలను పక్కాగా రూపొందించి, అందుబాటులో ఉన్న విస్తీర్ణానికి అనుగుణంగా ప్రణాళికలను శనివారం నాటికి అందించాలని ఆదేశించారు. భవిష్యత్తు విస్తరణకు కూడా అవకాశం ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రాధాన్యత కలిగిన జీజీహెచ్‌లో వైద్యులు సమన్వయంతో పనిచేసి ఆసుపత్రి సేవలు, పేరు ప్రతిష్టలను మరింత పెంచాలని కలెక్టర్ అన్నారు. వైద్యం కోసం వచ్చే రోగులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

**ప్లాస్టిక్ సర్జరీ వార్డు పనుల పరిశీలన**

స్థానికంగా లభ్యమైన రూ. 25 లక్షల నిధులతో చేపడుతున్న ప్లాస్టిక్ సర్జరీ వార్డు పనులను కలెక్టర్ పరిశీలించారు. భవనంలో ఎక్కడా నీటి లీకేజీలు లేకుండా చూడాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లను ఆదేశించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు.

**నెల రోజుల్లో పారిశుధ్యం మెరుగుపడాలి**

జీజీహెచ్‌లో నెల రోజుల్లో పారిశుధ్య పరిస్థితులు గణనీయంగా మెరుగుపడాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా ఓపీ విభాగం, మరుగుదొడ్ల వద్ద పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పారిశుధ్యంపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమీక్షలో జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గా ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# టెక్కలి నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు విస్తృత పర్యటన



- దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, పంట పొలాల పరిశీలన
- పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు

**టెక్కలి (జర్నలిస్ట్ ఫైల్)** : టెక్కలి నియోజకవర్గంలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విస్తృత పర్యటన చేశారు. టెక్కలి మండలం పరిధిలోని మెలియాపుట్టి రహదారిని పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాలను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం విస్తృతంగా పరిశీలించారు.

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రహదారులను స్వయంగా పరిశీలించారు.

రహదారుల పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, రహదారులు, భవనాల శాఖల అధికారులతో పరిస్థితిపై సమీక్షించి, ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. పాడైన రహదారులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు, కొత్త రహదారుల ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు.

గిరిజన ప్రాంతాల్లోని అన్ని గ్రామాలకు నూతన రహదారులు వేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని రహదారులు, పంచాయతీరాజ్, ఐటీడీఏ అధికారులకు సూచించారు.

నందిగామ మండలం కొత్త అగ్రహారం వద్ద తుఫాన్ ప్రభావంతో కూలిపోయిన వంతెనను మంత్రి పరిశీలించారు.

వంతెన పునర్నిర్మాణానికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని ఆదేశించారు.

వర్షాలతో వ్యవసాయ పొలాల్లో చేరిన నీటిని కూడా మంత్రి పరిశీలించారు. పంట పొలాల్లో నీటి నిల్వలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రాంతాల్లో నిలిచిన నీరు బయటకు వెళ్లేలా కాలువలు, నీటి మార్గాలను సరిచేయాలని అధికారులకు సూచించారు.

రైతులకు నష్టం కలగకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, AMC చైర్మన్ శేషగిరిరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు,

# అక్టోబర్ 2న ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు

- విజయవాడ రెవెన్యూ భవన్‌లో ఎన్నికల నిర్వహణ
- 8 రాష్ట్ర పదవులకు ప్రత్యక్ష ఎన్నిక

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గానికి 2026–2029 కాలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు అక్టోబర్ 2న విజయవాడలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి తెలిపారు.

రాష్ట్ర సంఘ కార్యవర్గం మూడేళ్ల పదవీకాలం 2026 జూలై 8తో పూర్తయిందని, ఇప్పటికే రాష్ట్రంలోని 26 జిల్లాల ఎన్నికలు పూర్తయ్యాయని తెలిపారు.

నూతన రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటుకు ఎన్నికల అధికారిగా చేబ్రోలు కృష్ణమూర్తిని, సహాయ ఎన్నికల అధికారిగా ఏపీఆర్ఎస్ఏ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బత్తిన రామకృష్ణను నియమించారు. ఈ మేరకు సెప్టెంబరు 21న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు.

నోటిఫికేషన్ ప్రకారం అధ్యక్షుడు, అసోసియేట్ అధ్యక్షుడు, మహిళా వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ, మహిళా జాయింట్ సెక్రటరీ, మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ, ప్రచార కార్యదర్శి, ట్రెజరర్ పదవులకు మొత్తం 8 మందిని ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఎన్నుకోనున్నారు.

**ఉదయం 10 గంటలకు నామినేషన్ల ప్రక్రియ**

విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో అక్టోబర్ 2న ఉదయం 10 గంటలకు నామినేషన్ పత్రాల జారీతో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. అనంతరం నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, జాబితా ప్రచురణ, ఉపసంహరణ ప్రక్రియలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.

పోటీ ఉన్న పదవులకు మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎన్నికలు నిర్వహించి, అదే రోజు ఫలితాలను ప్రకటించడంతో పాటు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి చేబ్రోలు కృష్ణమూర్తి తెలిపారు.

# భారీ వర్షంలోనూ నిడదవోలులో మంత్రి కందుల దుర్గేష్ క్షేత్రస్థాయి పర్యటన

- మోకాల్లోతు నీటిలో నడుస్తూ నిడదవోలులో పర్యటించిన మంత్రి
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు, ప్రజలకు సూచన



**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్)** : భారీ వర్షాల నేపథ్యంలో నిడదవోలు నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడానికి రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ వర్షంలోనే నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు.

తిమ్మరాజుపాలెం, కోటసత్తెమ్మ గుడి రోడ్డుతో పాటు పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో మోకాల్లోతు వర్షపు నీటిలో నడుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చొరవ చూపారు. తొలుత బస్టాండ్ ప్రాంగణంలో నిలిచిన నీటిని పరిశీలించి, అక్కడ నీరు నిలబడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నిడదవోలు–యర్నగూడెం ప్రధాన రహదారిపై నీటి నిల్వలను పర్యవేక్షించారు. పంట కాలువ నుండి నీరు రావడంతో కోటసత్తెమ్మ గుడి సమీపంలో నీరు నిలిచిందన్న సమాచారంతో వెంటనే ఆ ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఉదయం నుంచే అధికారులను అప్రమత్తం చేసి సమస్య పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. కంసాలిపాలెం–మాధవరం మధ్య నీటి ఉధృతి పెరిగిన నేపథ్యంలో.. తక్షణమే ఎమ్మార్వో, ఆర్డీవోలను రంగంలోకి దింపి ప్రజలు అప్రమత్తంగా ఉండేలా ప్రమాద హెచ్చరిక బోర్డులను, బారికేడ్లను ఏర్పాటు చేయించారు. అలాగే, భారీ వర్షాల ధాటికి పట్టణంలో అక్కడక్కడ విద్యుత్ తీగలు వేలాడుతున్నట్లు స్థానికులు తెలపడంతో మంత్రి దుర్గేష్ స్పందించి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మీడియాతో మాట్లాడుతూ... బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో తీవ్రంగా వర్షాలు కురుస్తున్నాయని, ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని కాల్దారి, నిడదవోలు బస్టాండ్ ప్రాంతాలు, తిమ్మరాజుపాలెం కల్వర్టు తెగడం వంటి సమస్యలు తలెత్తాయని తెలిపారు. గత పాలకులు అభివృద్ధిపై దృష్టిసారించకపోవడం వల్లే ఈ సమస్యలు ఏర్పడ్డాయని విమర్శించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బస్టాండ్ వద్ద డ్రైన్ నిర్మాణం, తిమ్మరాజుపాలెం వద్ద కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని త్వరలోనే నిధులు మంజూరవుతాయని వెల్లడించారు. బస్టాండ్ డ్రైన్ సమస్యపై ఆర్టీసీ ఎండీతో, మున్సిపల్ శాఖతో ప్రత్యేకంగా మాట్లాడినట్లు తెలిపారు. కంసాలిపాలెం వద్ద ఎర్రకాలువ ఉప్పొంగే పరిస్థితి ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టామని, అధికారులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలకు లబ్ధి చేకూర్చేందుకే తాము ప్రజాప్రతినిధులుగా ఉన్నామని, డ్రైన్ల నిర్మాణానికి త్వరితగతిన అనుమతులు సాధించి నిధులు సేకరించి పనులు ప్రారంభిస్తామన్నారు. మాలకోడు చెరువు వద్ద ఎస్టీపీ ప్లాంట్ పనులు పూర్తయితే పట్టణంలో మురుగునీటి సమస్య పూర్తిగా తొలగిపోతుందని పేర్కొన్నారు. ఆ దిశగా తాము పనులు శరవేగంగా చేస్తున్నామన్నారు.

ప్రజలు వాట్సాప్ ద్వారా తమ సమస్యలను తన దృష్టికి తెస్తున్నారని, అధికారులతో సమన్వయం చేసుకుంటూ వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అధికారులు, ప్రజలు, రాజకీయ నాయకులు అందరూ ఐక్యంగా పనిచేసి ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొందామని పిలుపునిచ్చారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467